వాయిస్ ఆఫ్ ప్రజలు

# వాయిస్ టుడే

TGTEL/25/A2649

VOICE OF PRAJALU

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

శనివారం, ఫిబ్రవరి 7, 2026

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## నేడు ఓలా, ఊబర్, ర్యాపిడో డ్రైవర్ల సమ్మె




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఓలా, ఊబర్, ర్యాపిడో తదితర ప్లాట్‌ఫాంలలో పనిచేస్తున్న బైకులు, ఆటోలు, క్యాబ్‌ల డ్రైవర్లు 7వ తేదీ, శనివారం దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారు. ఆయా యాప్‌ల ఆధారంగా పని చేస్తున్న డ్రైవర్లు కనీసం ఆరు గంటలపాటు తమ సేవలను బహిష్కరించాలని నిర్ణయించారు. తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్(టీజీపీడబ్ల్యూయూ) ఇచ్చిన ఈ దేశవ్యాప్త సమ్మెకు పలు కార్మిక సంఘాలు మద్దతు పలికాయి. కనీస చార్జీలు, మెరుగైన పని పరిస్థితులు, ప్రైవేటు వాహనాలను వాణిజ్య అవసరాలకు వాడడాన్ని నిరోధించాలన్న ప్రధాన డిమాండ్లతో సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ సమ్మె ప్రభావం ఒక్కో నగరంలో ఒక్కో విధంగా ఉంటుంది.

# ‘రేవంతుద్దీన్’ అన్న పిలుపు నాకు గర్వమే

### కేసీఆర్‌కు జైలుకాకుండా అడ్డుగా ఉన్నది ఎవరు?

### కిషన్‌రెడ్డి వ్యవహారంపై తీవ్ర వ్యాఖ్యలు

### అన్ని కులాలుమతాలను కలుపుకొని ముందుకెళ్తా

### నిజామాబాద్ బహిరంగ సభలో సీఎం స్పష్టీకరణ




నిజామాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తనను ముస్లిం పేరుతో ‘రేవంతుద్దీన్’ అని పిలిచిన విషయాన్ని సంతోషంగా స్వీకరిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పేరు మార్చి పిలిచినా తన ఆలోచనలు, అభివృద్ధి దృష్టి మారవని స్పష్టం చేశారు. అయితే అదే వేదికపై కూర్చున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాత్రం కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్‌ను జైలుకు వెళ్లకుండా కాపాడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేశాపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌కు కేటీఆర్ అనే కుమారుడు ఉన్నాడని, అయితే కిషన్‌రెడ్డి మాత్రం దత్తపుత్రుడిగా మారి కేసీఆర్, హరీశ్‌రావులను రక్షిస్తున్నారని సీఎం ఆరోపించారు. గతంలో ప్రధానమంత్రి మోదీ రాష్ట్రానికి

(మిగతా 2వ పేజీలో)



## స్కామ్‌లే పాలన.. స్కీమ్‌లు మాయ

### రెండేళ్లలో ఒక్క హామీ అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం

### ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేశారు

### బాండ్‌పేపర్ చూపిస్తూ ఆది శ్రీనివాస్‌పై కేటీఆర్ విమర్శలు

### దేవుడి పేరు, కులం పేరుతో ఓట్లు అడుక్కోవడమే బీజేపీ రాజకీయం

### కారుకు ఓటుతో కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేయాలన్న కేటీఆర్

సిరిసిల్ల: రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కొత్త సంక్షేమ పథకాలు ఒక్కటైనా అమలుకాలేదని, స్కామ్‌లు, అవినీతి ఆరోపణలే రాష్ట్రాన్ని వెంటాడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. శుక్రవారం సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలతో ప్రజల విశ్వాసాన్ని దుర్వినియోగం చేసిందని కేటీఆర్ అన్నారు. ఎన్నికల సమయంలో

(మిగతా 2వ పేజీలో)



## 3 వారాలే గడువు..

### ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం హెచ్చరిక

### స్పీకర్ నిర్ణయానికి స్పష్టమైన డెడ్‌లైన్

### ఆలస్యం కొనసాగితే నేరుగా జోక్యం

### ఎన్నికల పేరుతో కాలయాపనపై అసహనం

### తదుపరి విచారణ 3 వారాలకు వాయిదా

న్యూఢిల్లీ: తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత అంశంపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టమైన గడువు విధించింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో జరుగుతున్న జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, మూడు వారాల్లోగా తుది నిర్ణయం ప్రకటించాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించింది. ఆ గడువులో నిర్ణయం వెలువడకపోతే, తామే స్వయంగా జోక్యం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీద్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఈ వ్యవహారంపై విచారణ చేపట్టింది. గతంలోనూ స్పీకర్‌కు సమయం ఇచ్చినప్పటికీ నిర్ణయం రాకపోవడంపై కోర్టు తీవ్రంగా స్పందించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అనర్హత అంశాలు అనిశ్చితిలో ఉండకూడదని వ్యాఖ్యానించింది. తెలంగాణ ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. అనర్హత పిటిషన్లపై విచారణ ఇప్పటికే ప్రారంభమైందని, పెండింగ్‌లో ఉన్న పిటిషన్లలో ఒకదానిపై నిర్ణయం కూడా తీసుకున్నామని కోర్టుకు తెలిపారు. మిగిలిన పిటిషన్లు విచారణ దశలో ఉన్నాయని, రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండటంతో కొంత సమయం అవసరమైందని పేర్కొన్నారు. మార్చి మధ్య నాటికి లేదా అంతకంటే ముందే ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందని ఆయన వివరించారు. అయితే పిటిషనర్ల తరఫున, బీఆర్ఎస్ నేతలు పాడి కౌశిక్‌రెడ్డి, కేటీఆర్‌ల తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది మోహిత్‌రావ్ ఈ వాదనలను తీవ్రంగా ఖండించారు. గత 16 నెలలుగా స్పీకర్ కార్యాలయం ఈ అంశాన్ని కావాలని

(మిగతా 2వ పేజీలో)



## ఇస్లామాబాద్ శివార్లలో ఆత్మాహుతి దాడి

### మసీదు వద్ద భారీ పేలుడు

### కనీసం 50 మంది మృతి, 169 మందికి పైగా గాయాలు

### మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం

### విదేశీ ఉగ్రవాది పాత్రపై అనుమానాలు



### పెద్ద నాయకులు పార్టీని గాలికి వదిలేసినట్లుగా ఉంది: బీఆర్ఎస్ నేతలపై కవిత సంచలన వ్యాఖ్యలు

బీఆర్ఎస్ పార్టీకి బీసీలు ఓటు వేయాలో వద్దో నిర్ణయించుకోవాలని వ్యాఖ్య

మున్సిపల్ ఎన్నికల్లో కృష్ణార్జునులు ఎందుకు ప్రచారం చేయడం లేదని ప్రశ్న

వాళ్లు రాష్ట్రస్థాయి నేతలు కాదా అని నిలదీత



## ఆ విషయంలో రేవంత్ సర్కార్ మాట తప్పింది: హరీష్‌రావు




### యువ జట్టు అద్భుతం.. ఆరోసారి ప్రపంచకప్ గెలిచిన టీమిండియాకు

అండర్-19 ప్రపంచకప్‌లో ఆరోసారి ఛాంపియన్‌గా నిలిచిన భారత్

ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల తేడాతో ఘనవిజయం

175 పరుగులతో విధ్వంసం సృష్టించిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ

యువ జట్టుకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ, సచిన్ టెండూల్కర్

ఈ విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందన్న ప్రధాని



## కాంగ్రెస్-బీఆర్ఎస్‌లది విడదీయరాని బంధం

### ‘ఓటుకు కోట్లు’ నుంచి కాళేశ్వరం వరకూ అదేతీరు

### అప్పట్లో రేవంత్‌ను కాపాడిన కేసీఆర్

### ఇప్పుడు కేసీఆర్‌కు రేవంత్ రక్షణ

### కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణకు డిమాండ్

### బీజేపీ మున్సిపల్ మేనిఫెస్టో ఆవిష్కరణ

హైదరాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉన్నది సాధారణ రాజకీయ సంబంధం కాదని, ఫెవికాల్, ఫెవిక్విక్‌లా విడదీయలేని బంధమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. ఈ బంధం గతంలోనూ, ప్రస్తుతం కూడా స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఒకప్పుడు ‘ఓటుకు కోట్లు’ కేసులో రేవంత్‌రెడ్డిని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కాపాడారని, అదే తరహాలో ఇప్పుడు కాళేశ్వరం అవినీతి వ్యవహారంలో కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి రక్షిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బరాజ్‌లు కూలిన ఘటన తర్వాత మొత్తం అవినీతి అంశాన్ని పక్కనపెట్టి, కేవలం ఆ నిర్మాణాలపైనే జస్టిస్ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని రాంచందర్‌రావు ఆరోపించారు. ప్రాజెక్టు మొత్తం వ్యవహారంపై సీబీఐతో సమగ్ర విచారణ జరపాలని బీజేపీ మొదటి నుంచే డిమాండ్ చేస్తోందని స్పష్టం చేశారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సహ ఇన్‌చార్జిలు

(మిగతా 2వ పేజీలో)

# యువ జట్టు అద్భుతం.. ఆరోసారి ప్రపంచకప్ గెలిచిన టీమిండియాకు ప్రధాని మోదీ ప్రశంసలు

**అండర్-19 ప్రపంచకప్‌లో ఆరోసారి ఛాంపియన్‌గా నిలిచిన భారత్**

**ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల తేడాతో ఘనవిజయం**

**175 పరుగులతో విధ్వంసం సృష్టించిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ**

**యువ జట్టుకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ, సచిన్ టెండూల్కర్**

**ఈ విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందన్న ప్రధాని**



అండర్-19 ప్రపంచకప్‌లో భారత యువ జట్టు చారిత్రక విజయం సాధించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. జట్టు సభ్యులకు అభినందనలు తెలుపుతూ, ఈ విజయం ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. "భారత క్రికెట్ ప్రతిభ మరోసారి ప్రకాశించింది. అండర్-19 ప్రపంచకప్ గెలిచిన మన యువ జట్టును చూసి గర్వపడుతున్నాను. టోర్నమెంట్ ఆసాంతం అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించారు" అని ప్రధాని 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. హరారే వేదికగా జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగుల భారీ తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. తద్వారా రికార్డు స్థాయిలో ఆరోసారి అండర్-19 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లకు 411 పరుగుల భారీ స్కోరు చేసింది. కేవలం 80 బంతుల్లో 15 ఫోర్లు, 15 సిక్సర్లతో సూర్యవంశీ 175 పరుగులు చేశాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53), కనిష్క్ చౌహాన్ (37) కూడా రాణించారు. భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ కూడా దీటుగానే పోరాడింది. కాలెబ్ ఫాల్కనర్ (115) శతకంతో మెరిశాడు. అయితే, భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి ఒత్తిడి పెంచారు. ఆర్‌ఎస్ అంబరీష్ 3 వికెట్లు పడగొట్టగా, దీపేష్ దేవేంద్రన్ 2 వికెట్లతో రాణించడంతో ఇంగ్లండ్ 311 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ చారిత్రక విజయంపై ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తదితరులు యువ జట్టుకు అభినందనలు తెలిపారు. ముఖ్యంగా 14 ఏళ్ల సూర్యవంశీ అద్భుత ప్రదర్శనను సచిన్ ప్రత్యేకంగా ప్రశంసించాడు.

# 'రేవంతుద్దీన్' అన్న పిలుపు నాకు గర్వమే



వచ్చినప్పుడు కాళేశ్వరం అక్రమాలపై కేసీఆర్‌ను ఆరు నెలల్లో జైలుకు పంపుతామని ప్రకటించిన కిషన్‌రెడ్డి ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. ఆ హామీలు ఏమయ్యాయని నిలదీశారు. కిషన్‌రెడ్డిని మళ్లీ ప్రజల్లోకి తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కోరుతున్నానని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై అసెంబ్లీలో చర్చ జరిపి కేసును సీబీఐకి అప్పగించామని సీఎం గుర్తుచేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఎవరు అడ్డుగా ఉన్నారని ప్రశ్నించారు. కేసీఆర్, హరీశ్‌రావులను చర్లపల్లి జైలుకు పంపకుండా అడ్డుకుంటున్న శక్తులు ఎవరో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. తనను రేవంత్‌గౌడ్, రేవంత్ మాదిగ, రేవంత్ ముదిరాజ్, రేవంత్ యాదవ్, సర్దార్ రేవంత్ సింగ్ అంటూ పిలిచిన సందర్భాలను సీఎం గుర్తు చేశారు. ప్రతి వర్గం తనను తమవాడిగా భావించడం తనకు గర్వకారణమని అన్నారు. బీసీ కులగణన చేపట్టినందుకు ఒక వర్గం, ఎస్సీ వర్గీకరణకు పరిష్కారం చూపినందుకు మరో వర్గం తనను తమ పేర్లతో పిలిచిందని తెలిపారు. ఇవన్నీ తనకు ఆనందం కలిగించాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా రాజకీయంగా అవకాశాలు కూడా ఇచ్చిందని సీఎం తెలిపారు. ఎన్నికల్లో ఓడినా నాయకులకు పదవులు ఇచ్చి గౌరవించామని చెప్పారు. మైనారిటీ వర్గాలకు కార్పొరేషన్ పదవులు ఇచ్చామని వివరించారు. అందుకే తనను ఏ పేరుతో పిలిచినా స్వీకరిస్తానని, అన్ని కులాలు, మతాలను కలుపుకొని తెలంగాణను అభివృద్ధి బాటలో నడిపిస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్ల పాటు ఒక్క కొత్త రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక లక్షలాది కుటుంబాలకు రేషన్ కార్డులు జారీ చేశామని తెలిపారు. రాష్ట్రంలో కోట్లాది మందికి సన్నబియ్యం, పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్, తక్కువ ధరకు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ లోపాయికారీగా కలిసి పనిచేస్తున్నాయని, ఈ రెండు పార్టీల మధ్య బంధం విడదీయలేనిదని విమర్శించారు. తాను, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ కలిసి జోడెద్దుల్లా పని చేస్తున్నామని సీఎం తెలిపారు. 2023లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చినట్టే, రానున్న ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఎన్నేళ్లైనా రాష్ట్రాన్ని పాలిస్తుందని ప్రకటించారు. ఈ సభలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# స్కామ్‌లే పాలన.. స్కీమ్‌లు మాయ



చెప్పిన హామీలను అమలు చేయకుండా, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పట్టించుకోకుండా తప్పించుకుంటోందని విమర్శించారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎన్నికల సమయంలో వంద రోజుల్లో హామీలు అమలు చేస్తానంటూ రాసిచ్చిన బాండ్‌పేపర్‌ను సభలో ప్రజలకు చూపించారు. ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని, ఆ తర్వాత అభివృద్ధి జాడ లేకుండా మాయమయ్యారని విమర్శించారు.

'నాకు ఓటు వేయకుంటే చనిపోతానని, నాలుగుసార్లు ఓడిపోయానని సానుభూతి మాటలతో ప్రజలను మభ్యపెట్టారు. ఎన్నికలు పూర్తయ్యాక హామీల అమలు సంగతి దేవుడెరుగు, నియోజకవర్గానికి ముఖం కూడా చూపడం లేద'ని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్‌కు మరోసారి ఓటు వేస్తే మోసాలకు మద్దతిచ్చినట్లేనని హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా తీర్పు వస్తే, భవిష్యత్తులో కూడా హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి పెట్టే అవకాశమే ఉండదన్నారు. రూ.4 వేల పెన్షన్, రైతు భరోసా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, తులం బంగారం వంటి హామీలు అమలవ్వాలంటే కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రెండుళ్లలో ఎత్తివేసిందని ఆరోపించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలిచిన కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలంగాణకు చేసిందేమీ లేదని అన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో దేవుడి పేరు, కులం, మతం పేరుతో ఓట్లు అడుక్కోవడమే బీజేపీ రాజకీయమని విమర్శించారు. రూ.15 లక్షలు ఇస్తామని చెప్పిన మోదీ హామీ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో వేసే ఓటుతో మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసే ప్రస్థానం ప్రారంభం కావాలని కేటీఆర్ అన్నారు. కారుకు ఓటు వేసి తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ పాలనను తిరిగి తీసుకురావాలని ప్రజలను కోరారు. సిరిసిల్ల, వేములవాడల్లో జరిగిన ప్రచార సభల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 3 వారాలే గడువు..

ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. గతంలో నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుంటామని కోర్టుకు హామీ ఇచ్చి, ఇప్పటివరకు ఒక్కసారి మాత్రమే విచారణ జరిపారని గుర్తుచేశారు. ఒక ఎమ్మెల్యే బీఆర్ఎస్ నుంచి ఎన్నికై, అనంతరం కాంగ్రెస్ టికెట్‌పై లోక్‌సభకు పోటీ చేసి ఓడిపోయినా, ఇప్పటికీ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నారని ఉదాహరణగా ప్రస్తావించారు. ఇంత స్పష్టమైన పరిస్థితి ఉన్నప్పటికీ నిర్ణయం తీసుకోకపోవడం కాలయాపనకు నిదర్శనమని వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం ధర్మాసనం తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ సందర్భంగా న్యాయవాద వృత్తిలో నైతిక విలువలపై జస్టిస్ సంజయ్ కరోల్ కీలక వ్యాఖ్యలు చేశారు. కోర్టు విచారణలను రికార్డు చేసి సోషల్ మీడియాలో 'రీల్స్'గా ప్రచారం చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. న్యాయస్థానాలను వ్యక్తిగత ప్రచారానికి వాడుకోవద్దని, ఇది ఒక కొత్త పరిశ్రమలా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాలని న్యాయవాదులకు హితవు పలికారు.

## కాంగ్రెస్-బీఆర్ఎస్‌లది

# విడదీయరాని బంధం

అశోక్ పర్మాణి, రేఖాశర్మ, మాజీ ఎంపీ పి.రాములు, పార్టీ నేతలు డా.ఎన్.గౌతమ్‌రావు, ఎన్వీ సుభాష్‌లతో కలిసి 'వికసిత్ తెలంగాణ బీజేపీ సంకల్ప పత్రం' పేరుతో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రాంచందర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ ఎన్నికల ప్రచార గీతాన్ని కూడా విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ స్థానాల్లో విజయం సాధిస్తుందనే పూర్తి విశ్వాసం ఉందని ఆయన చెప్పారు. బీజేపీ గెలుపు ఖాయమని గ్రహించిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు అసహనంతో వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణకు కేంద్రం నుంచి ఏమీ రావడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించడం అబద్ధమని అన్నారు. జిల్లాల వారీగా కేంద్రం నుంచి వచ్చిన నిధుల పూర్తి వివరాలు తమ వద్ద ఉన్నాయని, అదే సమయంలో రాష్ట్ర బడ్జెట్‌లో ఏ జిల్లాకు ఎంత కేటాయించారో సీఎం చెప్పగలరా? అని ప్రశ్నించారు. ప్రాజెక్టులు, కాంట్రాక్టుల పేరుతో కమీషన్లు తీసుకుంటూ రాష్ట్రంలో కమీషన్ పాలన సాగుతోందని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు పాల్పడితే పార్టీ చూస్తూ ఊరుకోదని రాంచందర్‌రావు హెచ్చరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉందన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని అన్నారు. అవసరమైతే జాతీయ మానవహక్కుల కమిషన్ వరకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎన్నికల ప్రచారానికి రావడాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని, మంచిర్యాలలో బీజేపీ కార్యకర్తలపై ఒత్తిళ్లు పెంచుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను బెదిరించి, దాడులు చేసి ఉపసంహరణకు బలవంతం చేస్తున్న ఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నామని చెప్పారు. కర్ణాటక తరహాలో హేట్‌స్పీచ్ చట్టాన్ని బీజేపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అలాంటి చట్టం తీసుకొస్తే, ముందుగా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టిన ఆరోపణలపై సీఎం రేవంత్‌రెడ్డిపైనే కేసులు పెట్టాల్సి వస్తుందని రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు.

# ఆ విషయంలో రేవంత్ సర్కార్ మాట తప్పింది: హరీష్‌రావు

సంగారెడ్డి: పరిహారం విషయంలో రేవంత్ సర్కార్ మాట తప్పిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన సిగాచి పరిశ్రమ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిగాచి ప్రమాదంలో 54 మంది చనిపోతే ఎవరూ పట్టించుకోలేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ దివాళా కోరు ప్రభుత్వం నడుస్తుందంటూ దుయ్యబట్టారు. "ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేదు. పింఛన్లు సక్రమంగా ఇవ్వడం లేదు. కేసీఆర్ హయాలో తాగునీరు, విద్యుత్‌కు కొరతే లేదు. రేవంత్ రెడ్డి హయాంలో కరెంట్ కష్టాలు, నీటి యుద్ధాలు తప్పటం లేదు. కేసీఆర్ కంటే మంచిగా పనిచేసి పేరుతెచ్చుకుంటే.. రేవంత్ రెడ్డిని మెచ్చుకుంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్లు నరకమే. కరోనా వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చినా ప్రజలను కాపాడుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఉన్న సంక్షేమ పథకాలు బంద్ పెట్టడం తప్ప చేసిందేమిలేదు." అని హరీష్‌రావు మండిపడ్డారు. "సిగాచి పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో చనిపోయిన 54 మంది కార్మికులకు ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు ఇస్తానన్న రేవంత్.. కార్మికులను మోసం చేశాడు. ప్రజలకు ద్రోహం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, బీజేపీలను నమ్మొద్దు" అంటూ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## పెద్ద నాయకులు పార్టీని గాలికి వదిలేసినట్లుగా ఉంది: బీఆర్ఎస్ నేతలపై కవిత సంచలన వ్యాఖ్యలు

పెద్ద నాయకులు బీఆర్ఎస్ పార్టీని గాలికి వదిలేసినట్లుగా ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌పై, ఆ పార్టీ ముఖ్య నాయకులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీసీల అంశంలో బీఆర్ఎస్ పార్టీ ఏనాడూ చిత్తశుద్ధితో వ్యవహరించలేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలో వద్దో బీసీలే ఆలోచించుకోవాలని వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం ప్రముఖంగా కనిపించడం లేదని అన్నారు. ఆ పార్టీ నేతలు ఎవరూ కిందిస్థాయిలో క్రియాశీలకంగా లేరని విమర్శించారు. కృష్ణార్జునులు రాష్ట్రమంతా ఎందుకు పర్యటించడం లేదని ప్రశ్నించారు. వారిద్దరూ రాష్ట్రస్థాయిలో ప్రచారం చేయడం లేదంటే రాష్ట్రస్థాయి నాయకులు కానట్లే కదా అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బీఆర్ఎస్ తన నిర్ణయాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిటిషన్ వేసిన మాధవరెడ్డికి ఆ పార్టీ టిక్కెట్ ఎలా కేటాయించిందని నిలదీశారు.

# ఇస్లామాబాద్ శివార్లలో ఆత్మాహుతి దాడి

**మసీదు వద్ద భారీ పేలుడు**

**కనీసం 50 మంది మృతి, 169 మందికి పైగా గాయాలు**

**మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం**

**విదేశీ ఉగ్రవాది పాత్రపై అనుమానాలు**

ఇస్లామాబాద్: అస్థిరతతో కుదేలవుతున్న పాకిస్తాన్‌లో మరోసారి రక్తపాతం చోటుచేసుకుంది. షియా వర్గీయులే లక్ష్యంగా నిర్వహించిన ఆత్మాహుతి దాడిలో కనీసం 50 మంది ప్రాణాలు కోల్పోయారు. 169 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. రాజధాని ఇస్లామాబాద్ శివార్లలోని ఒక షియా మసీదులో శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనల సమయంలో అత్యంత శక్తివంతమైన పేలుడు సంభవించింది. ఈ ఘటనతో మసీదు పరిసర ప్రాంతం యుద్ధభూమిని తలపించింది. పేలుడు తీవ్రతకు అనేక మంది చేతులు, కాళ్లు తెగిపోవడంతో రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలారు. తీవ్రంగా గాయపడినవారి కేకలు, మృతుల బంధువుల రోదనలతో ఘటనా స్థలం హృదయ విదారకంగా మారింది. తమ కుటుంబ సభ్యులు సురక్షితంగా ఉన్నారా? అని పలువురు ఆత్రుతగా గాలిస్తూ కనిపించారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పోలీసులు, సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. "గాయపడిన వారిని పెద్ద సంఖ్యలో ఆస్పత్రులకు తరలించాం. వారి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది" అని ఒక పోలీసు అధికారి రాయిటర్స్‌కు తెలిపారు. ఇప్పటికే మృతుల సంఖ్య 70 దాటినట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. మృతుల్లో ఇస్లామాబాద్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు సంబంధించిన ఇద్దరు బంధువులు కూడా ఉన్నట్టు అధికారులు ధృవీకరించారు. దాడికి పాల్పడిన ఆత్మాహుతి బాంబర్ విదేశీయుడై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అతడు ఫిత్నా అల్ ఖ్వారాజీ అలియాస్ తెహ్రీక్‌ఇతాలిబాన్ పాకిస్తాన్ (టీటీపీ)కు చెందినవాడని ప్రాథమిక సమాచారం. అయితే ఈ ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని టీటీపీ ఒక ప్రకటనలో పేర్కొంది. తమ లక్ష్యం ఎప్పుడూ పాక్ సైన్యమేనని స్పష్టం చేసింది. అయినప్పటికీ, ఈ దాడి వెనుక ఉన్న శక్తులపై దర్యాప్తు కొనసాగుతోందని భద్రతా వర్గాలు తెలిపాయి. ఈ ఘోర ఘటనను పాకిస్తాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. "అమాయకులను లక్ష్యంగా చేసుకున్న ఈ దాడి పిరికిపంద చర్య. ఇది మానవత్వానికి మచ్చ" అంటూ వారు ప్రకటనలు విడుదల చేశారు. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ పాకిస్తాన్ పర్యటనలో ఉన్న సమయంలో ఈ దాడి జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇస్లామాబాద్‌లో గత ఆరు నెలల వ్యవధిలో ఇదే రెండో ఆత్మాహుతి దాడి. గత నవంబర్‌లో ఇస్లామాబాద్ కోర్టు సముదాయంలో ఒక వ్యక్తి కారులో తనను తాను పేల్చుకోవడంతో 12 మందికి పైగా మృతి చెందారు. అంతకుముందు 2008 సెప్టెంబరులో మారియట్ హోటల్‌పై జరిగిన ఆత్మాహుతి దాడిలో 63 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇస్లామాబాద్‌లోని హెహజాద్ టౌన్ పరిధిలోని తర్లాయ్ ప్రాంతంలో ఉన్న ఖదీజా అల్ కుబ్రా ఇమాంబరాలో శుక్రవారం మధ్యాహ్నం పెద్ద సంఖ్యలో షియా భక్తులు ప్రార్థనల కోసం చేరుకున్నారు. అదే సమయంలో ఆత్మాహుతి దుండగుడు లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించాడు. గేట్ వద్ద భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో, అతడు ముందుగా కాల్పులు జరిపి, ఆపై తనను



తాను పేల్చుకున్నట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పేలుడు ధాటికి మసీదు ప్రధాన ద్వారం పూర్తిగా కూలిపోయింది. సమీప భవనాల కిటికీలు ధ్వంసమయ్యాయి. చుట్టుపక్కల ప్రాంతమంతా ఛిన్నాభిన్నమైన మృతదేహాలు, తెగిపడ్డ అవయవాలతో భీతావహంగా మారింది. ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ కూడా ఈ దాడి తమదేనని ప్రకటించుకోలేదు. ఘటన నేపథ్యంలో ఇస్లామాబాద్‌లోని అన్ని ప్రధాన ఆస్పత్రుల్లో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. పాకిస్తాన్ గత కొంతకాలంగా ఆత్మాహుతి దాడులతో అతలాకుతలమవుతోంది. బలూచిస్తాన్‌లో స్వతంత్ర డిమాండ్‌తో బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ పాక్ సైన్యంపై తరచూ దాడులకు పాల్పడుతోంది. ఇటీవల జరిగిన ప్రతీకార చర్యల్లో ఇరు వర్గాలకు భారీ ప్రాణనష్టం జరిగిన విషయం తెలిసిందే.

# మూసాపేట్‌లో అభివృద్ధికి నాంది... రూ.55 లక్షల పనులకు ఘనంగా భూమి పూజ!

### – జిమ్ సెంటర్ అప్‌గ్రేడ్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, నూతన కమ్యూనిటీ హాల్‌తో డివిజన్‌కు కొత్త ఊపిరి

### కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్



కూకట్ పల్లి;ఫిబ్రవరి 6(వాయిస్ టుడే): మూసాపేట్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. రూ.55 లక్షల వ్యయంతో జనతా నగర్‌లో జిమ్ సెంటర్ రినోవేషన్, నూతన ఆధునిక పరికరాల ఏర్పాటు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించడంతో పాటు గుంతల బస్తీ సత్య వెల్ఫేర్ అసోసియేషన్ పరిధిలో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మూసాపేట్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేందర్ మాట్లాడుతూ “మూసాపేట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. యువత ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆధునిక సదుపాయాలతో జిమ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నాం. గుంతల బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో ప్రజలకు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు శాశ్వత వేదిక అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తూ, మూసాపేట్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి హాజరైన స్థానికులు ఈ అభివృద్ధి కార్యక్రమాలను హర్షాతిరేకాలతో స్వాగతిస్తూ కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్, మేనేజర్ సలోమీ, జీహెచ్ఎంసీ ఏఈ రంజిత్, వర్క్ ఇన్స్పెక్టర్లు వినాయక్, వినయ్, సత్య వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బంటు శివ శంకర్, బీజేపీ సీనియర్ నాయకులు, డివిజన్ నాయకులు, మహిళా మోర్చ, ఓబీసీ మోర్చ నాయకులు, కాలనీ ప్రతినిధులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్యార్థుల లక్ష్యసాధనకు అవసరమైన మార్గదర్శకాలను 18 ప్రిన్సిపుల్స్ ఫర్ సక్సెస్

ఇన్ ఎగ్జామ్స్ పేరుతో పుస్తకాన్ని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డా. గుండ్లూరు సురేంద్ర బాబు రచించారు. ఇంగ్లీష్ వెర్షన్ పుస్తకాన్ని హైదరాబాద్ నాంపల్లి తెలుగు యూనివర్సిటీలో ఎన్టీఆర్ కళావేదికలో.తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరించారు. నేటి తరం విద్యార్థుల్లో విపరీతమైన ఒత్తిడి, చదువులో వెనకబాటు, జీవితంలో ఖచ్చితమైన లక్ష్యం లేకపోవడం వంటి... మనోవైకల్యాలను గుర్తించి పరిష్కరించుకునే ప్రయత్నాలకు ఈ పుస్తకం మార్గదర్శకం అవుతుందని ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. పరీక్షల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, జ్ఞాపకశక్తిని పెంచుకునే. ఆధునిక చిట్కాలు, భవిష్యత్తు ప్రణాళిక, ఆరోగ్య రక్షణకు, ఆహారపు అలవాట్లతో పాటు... పిల్లలను గైడ్ చెయ్యడంలో తల్లిదండ్రులకు కూడా ఈ పుస్తకం ఒక మార్గదర్శి లాంటిదన్నారు. నేటి సాంకేతిక యుగంలో మిషన్ల వాడకం పెరిగి పుస్తక వాడకం తగ్గిందని... తమ విజయానికి కారణమైన పుస్తక పఠనాన్ని గుర్తు చేసుకుంటూ... 18 ప్రిన్సిపుల్స్ ఫర్ సక్సెస్ ఇన్ ఎగ్జామ్స్ పుస్తకం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



## గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 6(వాయిస్ టుడే): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జిగా నియమితులైన కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మున్సిపాలిటీలోని లోని 2,5,6మరియు 17,20 వార్డులలో పార్టీ అభ్యర్థులు శిషహనాజ సమీర్, సారిక, నవ్యశ్రీ, చంద్రమౌళి, వంటేరు కొండల్ రెడ్డి రి మద్దతుగా స్థానిక గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నర్సారెడ్డి సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఎన్నికలలో ప్రజలు ఓట్లు వేయాలని సూచించారు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సన్న బియ్యం, ఉచిత కరెంటు, రైతు భరోసా, ఉచిత బస్సు వంటి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి స్థానిక కౌన్సిలర్లను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్ మహాశయులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓల్డ్ ఎం.ఐ.జి, తెల్లాపూర్ ప్రజలకు అలర్ట్..

### నేడు ఈ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బంద్..



శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే): ఎం.ఐ.జి సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సమ్మర్ యాక్షన్ లో భాగంగా నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శివ శంకర్ వెల్లడించారు. ఓల్డ్ ఎం.ఐ.జి లో ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3.00 నుండి సాయంత్రం 4.00 గంటల వరకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనన్నట్లు ఆయన తెలిపారు.

**తెల్లాపూర్ లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడే ప్రాంతాలు:** హుడా కాలనీ, ఆదిత్య విల్లాస్ పరిసలు, జీ బ్లాక్, జడ్పీ స్కూల్ తెల్లాపూర్ పరిసరాలు మొత్తం ఉదయం 11.00 నుండి మధ్యాహ్నం 2.00 వరకు. రాజపుష్ప విల్లాస్ మొత్తము ఉదయం 11.00 నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు. తెల్లాపూర్ గ్రామం, ఇందిరానగర్, ఏ.బి కాలనీ, జే.పీ కాలనీ, కే.బీ కాలనీ, ఏ బ్లాక్ వాసుదేవా బ్లూమ్స్ మధ్యాహ్నం 3.00 నుండి సాయంత్రం 4.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారి శివ శంకర్ తెలిపారు.

## వడివడిగా సాగుతున్న ఉప్పల్ హిల్స్ కమిటీ హాల్

### – ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):– పనులు పరిశీలించిన రజిత పరమేశ్వర్ రెడ్డి ఉప్పల్ హిల్స్ లో రూ.50లక్షలతో చేపడుతున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను వేగంగా సాగుతున్నాయి. ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి శుక్రవారం స్లాబ్ పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ రాజ్ కుమార్,దుర్గం నవీన్ యాదవ్ గోవింద్ కుమార్ స్వామి . సల్ల ప్రభాకర్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి పి రామచందర్,టి శ్రీనివాస్ రెడ్డి,జి రమేష్ టి విజయ్ సింగ్,గోవిందు సుధాకర్ రెడ్డి,రాములు,అక్కు రవి . మధు, అమృత రాజు, మహేష్ గౌడ్,శేఖర్ గౌడ్, పి మహేందర్,సంజయ్,బి అనిత, సత్యనారాయణ చారి,గౌరిగే సత్తయ్య మేడిశెట్టి క్లైమెట్, రామస్వామి,గోవింద్ కొమరయ్య,గోవింద్ నరసయ్య,పర్వతాలు యాదవ్, గిరి,గౌర్రె సత్తయ్య,బీరయ్య,బీరయ్య, చందు పాల్గొన్నారు.



## రెడ్డి కాలనీ అభివృద్ధి కి అన్ని విధాలా కృషి చేస్తా..

### – ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):– చర్లపల్లి డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీలో జైలు నుండి ఎన్ ఓ సి వచ్చే విధంగా కృషి చేసి స్టాము వాటర్ డ్రైన్ నిర్మాణ పనుల కోసం కోటి 26 లక్షల నిధులు మంజూరు చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారికి కాలనీ వాసుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డి కాలనీ లో ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కాలనీకి సంబంధించిన ఇతర మౌలిక సదుపాయాల సమస్యలపై కూడా ఎమ్మెల్యే గారితో సానుకూలంగా చర్చించగా, వాటి పరిష్కారానికి తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.రెడ్డి కాలనీ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ సహకరిస్తున్న ఎమ్మెల్యే గారికి మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము అని వారు అన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## బిఆర్ఎస్ నాయకులపై దాడులను నిరసిస్తూ ధర్నా

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 6(వాయిస్ టుడే): బిఆర్ఎస్ పార్టీ నాయకులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా నిరసిస్తూ, కాంగ్రెస్ పార్టీకి చెందిన వజ్రేష్ యాదవ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ ముందు బిఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుతో పాటు మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు మల్లారెడ్డి, మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బిఆర్ఎస్ నాయకులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ, పార్టీ శ్రేణులతో కలిసి పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు.



## గడ్డపోతారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ జండా ఎగరవేయడం ఖాయం

### కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 6(వాయిస్ టుడే): మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు శంభీపూర్ క్రిష్ణ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం భాగంగా పటాన్చెరు నియోజకవర్గం గడ్డపోతారం మున్సిపాలిటీ కాజిపల్లి 5,6 వార్డులో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు గద్దె సుష్మ గణేశ్ మరియు గండి స్వప్న మద్దతుగా ఉదయం 6:30 నుండి 9:30 గంటల వరకు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గడ్డపోతారం మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులు కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఇన్చార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభమైన “కోహా” లైబ్రరీ సైన్స్ కార్యశాల



సికింద్రాబాద్, ఫిబ్రవరి 06 (వాయిస్ టుడే ప్రతినిధి): ఓపెన్ సోర్స్ ఇంటిగ్రేటెడ్ లైబ్రరీ మేనేజ్మెంట్ సిస్టం, “కోహా” పేరుతో రెండు రోజుల కార్యశాల ఓయూ ఆర్ట్స్ కళాశాలలో లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ ఆదేశాలకు ముఖ్యఅతిథిగా ఓయూ వీసీ హాజరై మాట్లాడుతూ డిజిటల్ ఉపకరణాలు, మొబైల్ ఫోన్ల ను ఓపికతో ఉపయోగించుకోవాలని అప్పుడే తమకు అవసరమైన సమాచారాన్ని, విజ్ఞానాన్ని పొందవచ్చు అని చెప్పారు. సరైన, విలువైన సమాచారం పొందడం అనేది ఎంతో ముఖ్యమన్నారు. యూనివర్సిటీలో నాణ్యమైన బోధనను పెంపొందించుకోవడంతో పాటు క్వాలిటీ పరిశోధన పత్రాలను ప్రపంచస్థాయి జర్నల్స్ లలో ప్రచురించుకోవాలని వీసీ విద్యార్థులను, అధ్యాపకులను కోరారు. రీసెర్చ్ ఆర్టికల్స్ కు వచ్చే సైటేషన్స్ యూనివర్సిటీ కి , సదరు వ్యక్తులకు ఎంతో పేరు సంపాదించి పెడతాయని వివరిస్తూ హెచ్ ఇండెక్స్, జి ఇండెక్స్, ఐ ఇండెక్స్, క్యూ ఇండెక్స్, ఈ ఇండెక్స్, ఎం ఇండెక్స్ మొదలైనవి పరిశోధన పత్రాల క్వాలిటీని తెలియజేస్తాయి అన్నారు. తమ పరిశోధనల ద్వారా పేటెంట్స్ ను కూడా సాధించుకోవాలని విద్యార్థులకు, అధ్యాపకులకు విసి సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, వర్క్ షాప్ డైరెక్టర్ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విద్యా విధానంలో వస్తున్న మార్పుల కు తగిన విధంగా సిద్ధం కావాలని విద్యార్థులకు, అధ్యాపకుల కు సూచించారు. అరచేతిలో ఉన్న మొబైల్ ద్వారా అనేక అంశాలను పొందవచ్చునని చెప్పారు. కళాశాలలో తరగతులు రెగ్యులర్ గా నిర్వహించడంతోపాటు సదస్సులను, వివిధ కార్యక్రమాల ను నిర్వహిస్తూ విద్యార్థులను, అధ్యాపకులను ప్రోత్సహిస్తున్నామని ప్రిన్సిపాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ లైబ్రరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్. లక్ష్మణరావు, కార్యశాల కన్వీనర్ డాక్టర్ జె.వివేకవర్ధన్, రిసోర్స్ పర్సన్ డాక్టర్ శేషయ్య, లైబ్రరీ సైన్స్ వర్క్ షాప్ ఆర్గనైజింగ్ సెక్రటరీస్ డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ లక్ పతి, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## దోపిడీ కేసును చేదించిన రాయదుర్గం పోలీసులు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే): రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో మహాప్రస్థానం సమీపంలో జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించినట్లు రాయదుర్గం డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ తోట భూపతి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తనను ఓ వ్యక్తి రాయితో గాయపరిచి తన మొబైల్ ఫోన్ లాక్కొని పారిపోయాడని మహమ్మద్ ఒవైసి అని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించమన్నారు. ఈ నెల 3వ తేదీన రాత్రి 10.30 గంటల సమయంలో నిందితుడు మహమ్మద్ జావీద్, మహమ్మద్ ఒవైసిపై రాయితో దాడి చేసి గాయపరిచాడు. అనంతరం బాధితుడి యూపీఐ ఖాతా ద్వారా ? 400 బదిలీ చేయించుకొని, మొబైల్ ఫోన్ లాక్కొని ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. ఈనెల 5వ తేదీన రాయదుర్గం పీఎస్ క్రైమ్ సిబ్బంది నిందితుడిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి దొంగిలించిన మొబైల్ ఫోన్‌తో పాటు మరో రెండు మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించామన్నారు.



## ఎమ్మెల్సీ అంజిరెడ్డి కార్నర్ మీటింగ్

పటాన్ చెరు (వాయిస్ టుడే) : పటాన్ చెరు నియోజకవర్గ ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇస్నాపూర్ పట్టణంలో బిజెపి బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులు నిర్వహించిన కార్నర్ మీటింగ్ కు హాజరైన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బిజెపి నాయకులు పాల్గొన్నారు. అభ్యర్థుల తరఫున పట్టణంలో ఉన్న వివిధ షాపులలో ప్రచారం చేశారు. అనంతరం ఓటర్ల నుద్దేశించి మాట్లాడుతూ పాలనలో మార్పు రావాలంటే ప్రజలకు మంచి రోజులు కావాలంటే బిజెపి నీ గెలిపించుకోవాలని కోరారు. బిజెపిని గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తెప్పించి అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఇస్నాపూర్ లో నీటి సమస్య చాలా పెద్దగా ఉన్నదని మున్సిపల్‌లో మున్సిపల్ లో బిజెపి జెండా ఎగిరిన వెంటనే సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ఏ సమస్య ఉన్న ప్రజలకు బిజెపి పార్టీ అండగా ఉంటుందని అందరూ తమ తమ ఓటు హక్కును వినియోగించుకొని బిజెపిని గెలిపించాలని కోరారు.

# ఎం-ప్యానల్ లేకుండా అక్రిడేషన్ నోటిఫికేషన్‌నా?

**జర్నలిస్టులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఈ చిన్నచూపు?**

**అర్హత ఉన్న అన్ని పత్రికలను వెంటనే ఎం--పానల్ చేయాలి**

**నిజమైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డ్ ఇవ్వకుంటే ఉద్యమిస్తాం: టీజేఎస్ఎస్.**

**రిపోర్టర్లపై సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కక్ష కట్టారా?**

సికింద్రాబాద్, ఫిబ్రవరి 06 (వాయిస్ టుడే ప్రతినిధి): రాష్ట్రంలో అర్హత ఉన్న పత్రికలను ఎం-ప్యానల్ చేయకుండానే అక్రిడేషన్‌కు అప్లై చేసుకోవాలని నోటిఫికేషన్ ఇవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోందనీ, ఇది కేవలం పరిపాలనా నిర్ణయమా.? లేదా చిన్న పత్రికలు, నిజమైన రిపోర్టర్లను పక్కన పెట్టే కుట్రానా.? అనే ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయని జర్నలిస్టు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఎన్నికల ముందు మీడియా, ముఖ్యంగా చిన్న పత్రికలు, ఫీల్డ్ రిపోర్టర్లు కాంగ్రెస్‌కు అండగా నిలిచారు. ప్రజా సమస్యలను ముందుకు తీసుకెళ్లారు. టిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అలాంటి జర్నలిస్టులే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనగదొక్కబడుతున్నారా.? అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రిపోర్టర్లను పూర్తిగా పక్కన పెట్టేయడం జరుగుతుందన్నారు.

**ఎం-ప్యానల్ లేకుండా అక్రిడేషన్ అంటే ఎవరికీ లాభం.?**

ఎం-ప్యానల్ అనేది కేవలం ఒక అధికారిక ప్రక్రియ కాదు. పత్రిక నిజమైనదా.? క్రమం తప్పకుండా ప్రచురణ జరుగుతుందా.? ఫీల్డ్‌లో పని చేసే రిపోర్టర్లు ఉన్నారా.? ప్రజా సమస్యలపై కథనాలు వస్తున్నాయా.? ఈ విషయాలన్నిటిని డిపిఆర్వోలు ఐ అండ్ పి ఆర్ పర్యవేక్షించాలి. కానీ వాళ్ళ పర్యవేక్షణ ఎక్కడ.?జిల్లా డిపిఆర్ఓ ల వద్ద జిల్లాలో పనిచేసే రిపోర్టర్ల సమాచారం ఉందా.? ఎం పానెల్ చేయకుండా అక్రిడేషన్ ఇస్తే పేపర్ మీద మాత్రమే ఉన్న పత్రికలు, అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసే బినామీ మీడియా సంస్థలకే దారితీయదా.? దీని వల్ల నిజంగా రోడ్డెక్కి వార్తలు తెచ్చే గ్రౌండ్ రిపోర్టర్లు తీవ్రంగా నష్టపోతారు. ఈ విషయం సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఎందుకు గుర్తించడం లేదు.

**చిన్న పత్రికలు అంటే సీఎం రేవంత్ రెడ్డికి గిట్టదా.?**

గత కెసిఆర్ ప్రభుత్వంలో చిన్న పత్రికలకు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రతిపక్షంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు మీడియా ముఖంగా ప్రశ్నించారు. ప్రస్తుతం రేవంత్ సర్కార్ అధికారంలో ఉంది మరి చిన్న పత్రికలకు మీడియాకు ఎందుకు అన్యాయం చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన మాటలు అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరిచిపోయారా.? పెద్ద పత్రికలకు ఒక్కరోజు ఇచ్చే అడ్వర్టైజ్మెంట్ ఖర్చులలో దాదాపు చిన్న పత్రికలు అన్ని బతికి బట్ట కడతాయి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎందుకు అర్థం చేసుకోవడం లేదు అధికారంలోనికి రావడానికి చిన్న పత్రికల సహాయం కావాలి వచ్చిన తర్వాత తొక్కి వేయాలి ఇదేనా.? ఈ నిర్ణయంతో ఒక ప్రశ్న స్పష్టంగా వినిపిస్తోంది,

"చిన్న పత్రికలు అంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గిట్టదు అని" పెద్ద పత్రికలకు కోట్ల రూపాయల ప్రకటనలు, చిన్న పత్రికలకు మాత్రం ఎంపానెల్ లేదు. భరోసా లేదు. గుర్తింపు లేదు, ఇదేనా ప్రజా పాలన.? ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం మీడియాకు ఇచ్చిన గౌరవం.? జర్నలిస్టులతోనే అధికారంలోకి వచ్చి, మీడియా స్వేచ్ఛ గురించి మాట్లాడిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఈరోజు అదే మీడియాను నియంత్రించే ప్రయత్నం చేస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నచ్చినవారికి అక్రిడేషన్, ప్రశ్నించేవారికి నిరాకరణ..**

జర్నలిస్టుల విషయంలో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతం కాదా.? మొదటగా అర్హత ఉన్న చిన్న పత్రికలకు ఏం ప్యానల్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోకపోవడం బాధాకరంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ముందుగా అర్హత ఉన్న పత్రికలను వెంటనే ఎం-ప్యానల్ చేయాలి. ఆ తర్వాతే అక్రిడేషన్ ప్రక్రియ చేపట్టాలి.చిన్న పత్రికలు, నిజమైన రిపోర్టర్లకు న్యాయం చేయాలి. లేకపోతే ఇది మీడియాపై దాడిగా, స్వేచ్ఛను హరించే చర్యగా చరిత్రలో మిగిలిపోతుందని తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టులను చిన్నచూపు చూడడం ద్వారా కాదు. వారికి గౌరవం ఇవ్వడం ద్వారా మాత్రమే, ప్రభుత్వం బలపడుతుందని టీజేఎస్ఎస్ సూచించింది.

# రూ.6 లక్షల విలువైన 500 కిలోల కాపర్ కేబుల్స్ కూకట్‌పల్లి పోలీసుల స్వాధీనం

**- మరో కేసులో ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం....**

**- కూకట్‌పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట సుబ్బారావు**



కూకట్ పల్లి; ఫిబ్రవరి 6(వాయిస్ టుడే): కూకట్ పల్లి పరిధిలోని మకుట తరంగ --ఐడిఎల్ సరస్సు ప్రాంతంలో సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఉల్లి కునాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అక్కడ నిల్వ ఉంచిన ఏడు బండిళ్ల కాపర్ ఆర్మర్డ్ కేబుల్స్‌ను దొంగతనం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా క్రైం నెం.183/2026, సెక్షన్ 305 దీచీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు సమయంలో, తేదీ 05-02-2026 న కూకట్ పల్లి పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు మకుట త్రిపుర సైట్‌లో సెక్యూరిటీ సిబ్బందిగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. మరింత విచారణ చేయగా, కేబుల్స్ దొంగతనానికి పాల్పడ్డట్లు నిందితులు అంగీకరించారు.ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.6 లక్షల విలువైన 500 కిలోల కాపర్ కేబుల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.నిందితుల వివరాలు:ఆ-1: లఖింద్ర బోరువా, వయస్సు: 26 సంవత్సరాలు, వృత్తి: సెక్యూరిటీ ఉద్యోగి,నివాసం: పోచమ్మ బస్తీ, లక్ష్మణ్ భాగ్, రాయదుర్గం, సైబరాబాద్,స్వస్థలం: చరైదెయో జిల్లా, అస్సాం రాష్ట్రం.

A-2: అనుపమ్ గోగోయ్ (తండ్రి: ప్రదీప్ గోగోయ్), వయస్సు: 26 సంవత్సరాలు, వృత్తి: సెక్యూరిటీ ఉద్యోగి, నివాసం: నిర్మల నగర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కొకాపేట్, స్వస్థలం: దిబ్రూగఢ్ జిల్లా, అస్సాం రాష్ట్రం. A-3: నీతు దాస్, వయస్సు: 25 సంవత్సరాలు, వృత్తి: సెక్యూరిటీ ఉద్యోగి,నివాసం: నిర్మల నగర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కొకాపేట్, స్వస్థలం: దిబ్రూగఢ్ జిల్లా, అస్సాం రాష్ట్రం.

A-4: నబజ్యోతి దాస్, నివాసం: నిర్మల నగర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కొకాపేట్, స్వస్థలం: దిబ్రూగఢ్ జిల్లా, అస్సాం రాష్ట్రం.

నిందితులందరూ అస్సాం రాష్ట్రం నుంచి సెక్యూరిటీ ఉద్యోగాల నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి, నానక్రామ్ గూడ ప్రాంతంలో నివసిస్తున్నట్లు వెల్లడైంది. మద్యం సేవనం, ధూమపానం వంటి దురలవాట్లకు అలవాటుపడి, విలాసవంతమైన అవసరాలను తీర్చుకునేందుకు దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది.

**ప్రజలకు సూచన:**

సెక్యూరిటీ సిబ్బందిని విధుల్లోకి తీసుకునే ముందు వారి పూర్తి నేపథ్య పరిశీలన (వెరిఫికేషన్) చేయాలని, గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా పరిశీలించి భద్రపరుచుకోవాలని కుకట్పల్లి పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు.

**మరో కేసు వివరాలు:** మరో కేసులో మహమ్మద్ సల్మాన్ (తండ్రి: లేట్ అబ్దుల్ యాకూబ్), నివాసం: మూసాపేట్, హైదరాబాద్ అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, డిసెంబర్ నెలలో అంజనేయ నగర్, మూసాపేట్ వద్ద ఒక ద్విచక్ర వాహనం ఐదు రోజుల క్రితం వైనవి హాస్టల్, మూసాపేట్ వద్దరెండు సెల్‌ఫోన్లు దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. ఈ మేరకు ద్విచక్ర వాహనం మరియు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అన్ని కేసులకు సంబంధించిన నిందితులను శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు.



## అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమి

**పరిశీలించిన బీజేపీ ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్**

సికింద్రాబాద్/ఉప్పల్, ఫిబ్రవరి 06 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉమ్మడి చిల్కానగర్ డివిజన్ లో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిన రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమి లక్ష్మీ స్టార్చ్ కంపెనీ సమీపంలో ఉన్న పెద్ద చెరువు పక్కన గల సుమారు రెండున్నర ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని శుక్రవారం బీజేపీ ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్ ఇతర బీజేపీ నాయకుల తో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వ స్థలం అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతున్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో మాజీ మంత్రి టి. దేవేందర్ గౌడ్ చెరువును ప్రజలకు ఉపయోగపడే విధంగా సుందరీకరణ చేశారు. అనంతరం మిగిలిన స్థలంలో కొంతమంది ఆక్రమణదారులు అక్రమంగా గుడిసెలు నిర్మించేందుకు ప్రయత్నించిన సందర్భంలో మాజీ శాసనసభ్యులు ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ నాయకులు ఉద్యమం చేపట్టి ప్రభుత్వ స్థలాన్ని రక్షించిన విషయం గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ స్థలం ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లకుండా, యువత ప్రక్కదారి పడకుండా నిరోధించడానికి, అలాగే సీనియర్ సిటిజన్లకు విశ్రాంతి, ప్రజలకు వినోదం, క్రీడల అభివృద్ధి కోసం ఈ స్థలాన్ని పార్క్, క్రీడా ప్రాంగణంగా అభివృద్ధి చేయాలని పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, స్థానిక ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ని విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ, హైడ్రా, జీహెచ్ఎంసీ విభాగాల సమన్వయంతో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని ప్రజా వినియోగానికి మార్చి అధిక జనసాంద్రత కలిగిన చిల్కానగర్ ప్రాంతానికి ఉద్యానవనం, క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. అధికారులు తగిన చర్యలు చేపట్టకపోతే భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో ఉప్పల్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ దేవసాని బాలచందర్, బీజేపీ సీనియర్ నాయకులు తిరుపతి సత్యనారాయణ , అడ్వకేట్ ఆలే నరేందర్ , శామీర్పేట చంద్రయ్య , విద్యాసాగర్ , ఓర్సు శేఖర్ , భవానంద్ , ముత్యాల కృష్ణారెడ్డి, సదాశివరెడ్డి , రమేష్ , కార్తీక్, వివేక్, స్థానిక నాయకులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వేలాది మంది భక్తులతో 8న శ్రీ శ్యామ్ బాబా రథయాత్ర

**బాబా శ్యామ్ రథశోభ యాత్ర కమిటీ చైర్మన్ ఇంద్రకరణ్ అగర్వాల్**



హైదరాబాద్, ఫిబ్రవరి 06: బాబా శ్యామ్ కు అత్యంత ఇష్టమైన ఫాల్గుణ మాసం ఫిబ్రవరి 8, 2026 న వేలాదిమంది భక్తులతో శ్రీ బాబా శ్యామ్ భారీ రథ్ యాత్రను నిర్వహిస్తున్నట్లు బాబా శ్యామ్ రథశోభ యాత్ర కమిటీ చైర్మన్ ఇంద్రకరణ్ అగర్వాల్, వైస్ చైర్మన్‌లు రామ్‌దేవ్ అగర్వాల్, పురుషోత్తం దాస్ గోయల్ లు తెలిపారు. హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కమిటీ సలహాదారు చంద్రకాంత్ డకోటియా. కన్వీనర్‌లు అమిత్ అగర్వాల్, రాంనిరంజన్ అగర్వాల్, సంతోష్ అగర్వాల్, నర్సింగ్ జైస్వాల్, జీవన్ భాటి, అభిషేక్ శర్మ, సుశీల్ అగర్వాల్, గోవింద్ పొద్దార్, శ్రీ శ్యామ్ మందిర్ సేవా సమితి అధ్యక్షులు చంద్రకాంత్ డకోటియా, ఉపాధ్యక్షులు కృష్ణ కుమార్ బడేగావ్‌వాలే, కార్యదర్శి ఇంద్రకరణ్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులు రామ్‌దేవ్ అగర్వాల్, రాజ్‌కుమార్ విగ్, కోశాధికారి కపిల్ అగర్వాల్ లతో కలసి వారు మాట్లాడారు. మహాభారతంలోని పాండవులలో ఒకరైన భీముని మనవడైన బర్బరీకుడికి అంకితం చేయబడిన ఖాటు శ్యామ్ జీ ఆలయం భారతదేశంలోని రాజస్థాన్ రాష్ట్రం, సికర్ జిల్లా, ఖాటు గ్రామంలో ఉందని, దక్షిణ భారతదేశంలో మొదటి ఖాటు శ్యామ్ జీ ఆలయం హైదరాబాద్‌లోని కాచిగూడ, వీరన్న గుట్టపై ప్రసిద్ధి చెందిందని వారు తెలిపారు. ఈ ఆలయాన్ని శ్రీ కంచి కామకోటి పీఠం, శ్రీ శ్యామ్ మందిర్ సేవా సమితి నిర్వహిస్తుందని, ఇక్కడ నిత్యం పూజలు, అభిషేకం, భక్తులకు శ్యామ్ జల్ (పవిత్ర జలం), ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామని, శ్రీ శ్యామ్ సంకీర్తన, దీనితోపాటు ప్రతిరోజూ ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తుల అన్ని రకాల కోరికలను తీరుస్తున్న బాబా శ్యామ్ కు అత్యంత ఇష్టమైన ఫాల్గుణ మాసంలో శ్రీ శ్యామ్ మందిర్ సేవా సమితి ఆధ్వర్యంలో బాబా శ్యామ్ రథ్ శోభ యాత్ర, జెండాల ఊరేగింపును ఫిబ్రవరి 8న ఉదయం చార్మినార్, మహాదేవ్ ఆలయం నుండి ప్రారంభమై, అఫ్జల్ గూంజ్, గౌలిగూడ, చాదర్ ఘాట్, నింబోలి అడ్డా మీదుగా కాచిగూడలోని వీరన్న గుట్ట శ్రీ శ్యామ్ మందిర్‌కు చేరుకుంటు ఒదని, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయని చెప్పారు. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుండి వేలాదిమంది భక్తులు ప్రత్యేక ప్రాముఖ్యత ఉన్న జెండా (నిషాన్) లతో పాల్గొని రథయాత్ర అనంతరం ఆలయంలో జెండాలను సమర్పిస్తారని అన్నారు. ఈ రథయాత్రలో భక్తులు జండాలు చేతబూని సంగీత వాయిద్యాలతో వచ్చి, భజనలు, కీర్తనలు పాడుతూ, నృత్యాలు చేస్తూ బాబాను ప్రసన్నం చేసుకుని, ఆలయంలో జెండాలను సమర్పిస్తారని, జెండాలు తీసుకువచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ భోజన ఏర్పాట్లను చేసిందని తెలిపారు. అత్యంత వైభవోపేతంగా జరిగే ఈ రథయాత్రను కనులారా వీక్షించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా శ్యామ్‌ను ప్రసన్నం చేసుకోవాలని వారు కోరారు.

# తెలంగాణలో స్థానిక సంస్థలకు కేంద్రం నిధులు విడుదల

**హర్షం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



సికింద్రాబాద్, ఫిబ్రవరి 06 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీలు, స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేసారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు తెలంగాణలో పంచాయితీ ఎన్నికలు ముగిసిన వెంటనే నిధులు విడుదల చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర పంచాయితీ రాజ్ మంత్రితో మాట్లాడి నిధులు విడుదల చేయించారన్నారు. గత దశాబ్ద కాలంగా తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. రూ.11వేల కోట్లకు పైగా నిధులను విడుదల చేసిందన్నారు. 2015-16 నుంచి 2019-20 మధ్యలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో గ్రామపంచాయతీలకు రూ.5,060 కోట్లు విడుదల చేయగా.. 2020-21 నుంచి 2025-26 మధ్యలో.. ఈ కేటాయింపులు 80% (రూ.9,050 కోట్లు) పెరిగాయి. ఇందులో రూ.6,051 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయడం ద్వారా మారుమూల ప్రాంతాల వరకూ జవాబుదారీతనం, పారదర్శకత పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు. ఇందుకోసమే.. స్థానిక సంస్థలకు సంబంధించిన నిధులను మొదట్నుంచీ సమయానుగుణంగా విడుదల చేస్తోందనీ చెప్పారు. ఇటీవల తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మిగిలిన నిధులను కూడా విడుదల చేసిందనీ అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల ఖర్చుపై యుటిలైజేషన్ సర్టిఫికెట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే సబ్‌మిట్ చేసిన నేపథ్యంలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులైన రూ.260 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మిగితా నిధులకు సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇవ్వగానే.. దశల వారిగా మిగిలిన రూ.2,500 కోట్ల నిధులు కూడా విడుదల కానున్నాయనీ చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ప్రతి గ్రామ పంచాయతీలో.. ఈ నిధుల వినియోగం కోసం తప్పనిసరిగా ప్రత్యేక బ్యాంకు అకౌంట్ తెరవాలనీ, ఈ అకౌంట్ గ్రాఖీమీా (పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) పోర్టల్.. లో నమోదు చేసుకుని యూనిక్ ఏజెన్సీ కోడ్ ను పొందాలని వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామపంచాయతీల అకౌంట్లను జప్తుచేసుకుని, ఆ నిధులను ఇతర అవసరాలకోసం దారి మళ్లించిందనీ, దీని కారణంగా చాలా మంది సర్పంచ్‌లు తమ హయాంలో చేసిన పనులకు నిధులు రానందున రాజీనామాలు చేశారన్నారు. కొందరు సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు, ఇది చాలా దురదృష్టకరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాభివృద్ధి కోసం చేస్తున్న అన్ని ప్రయత్నాలకు సహకరిస్తూ.. గ్రామ పంచాయతీలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలికవసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా చొరవతీసుకోవాలని కోరారు.

# ఇస్నాపూర్ మున్సిపల్ మాజీ మంత్రి హరీష్ రావు ఎన్నికలపై రివ్యూ మీటింగ్

పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్): పటాన్ చెరు మండల ఇంచార్జ్ మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ నివాసంలో ఎంఎల్సీ భూపాల్ రెడ్డి మరియు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి తో ఇస్నాపూర్ మున్సిపల్ ఎన్నికల రివ్యూ మీటింగ్ లో పాల్గొన్న అనంతరం...... ఇస్నాపూర్ జగన్నాథ్ స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని స్థానిక మహిళా సోదరీమణులతో ముఖ ముఖి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి వర్యులు సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ రాష్ట్రంలో పదేండ్ల కేసీఆర్ పాలన చూశారు.. ఈ రెండేళ్ల కాంగ్రెస్ పాలన చూస్తున్నారు. ఈ మధ్య కొంతమంది పంచాయతీ సెక్రటరీలు, ఉద్యోగులు నా దగ్గరకు వచ్చి వాళ్ళ బాధలు చెప్పుకున్నారు.

వాళ్లతో నేను ఒక్కటే మాట అన్నా.. మీకు ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్, పర్మినెంట్ చేసింది కేసీఆర్, జీతాలు పెంచింది కేసీఆర్. కానీ ఆయన్ను ఓడగొట్టి కాంగ్రెస్ ను గెలిపించింది మీరే కదా అన్నాను. రేవంత్ రెడ్డి మాటలు నమ్మి మోసపోయామని ఇప్పుడు వాళ్ళు బాధపడుతున్నారు.

కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండేదని అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు గ్రహిస్తున్నారు. రూ. 200 ఉన్న పెన్షన్ రూ. 2000 చేసింది కేసీఆర్. రేవంత్ రెడ్డి రూ. 4000 ఇస్తానని చెప్పి మోసం చేశాడు. ఈ 24 నెలల్లో ఒక్కో అవ్వతాతకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 52,000 బాకీ పడింది. అత్తా కోడలు ఇద్దరికీ రూ. 2500 ఇస్తానని చెప్పి ఇద్దరికీ మొండిచేయి చూపించాడు. ఉన్న కేసీఆర్ కిట్ బంద్ పెట్టాడు. కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇస్తానని ఆశపెట్టి.. కేసీఆర్ ఇచ్చే లక్ష రూపాయల చెక్కును కూడా నెలల తరబడి ఆపుతున్నాడు. కేసీఆర్ రాకముందు ఇస్నాపూర్‌లో పవర్ హాలిడేస్ ఉండేవి. కేసీఆర్ వచ్చాక 24 గంటల కరెంట్ ఇవ్వడంతో.. ఇక్కడ పరిశ్రమల్లో ఓటీలు దొరికి నాలుగు రూపాయలు సంపాదించుకున్నారు.



ఇప్పుడు మళ్ళీ కరెంట్ కోతలు మొదలయ్యాయి. ఫ్రీ బస్సు అని చెప్పి ఆటో వాళ్ళ పొట్ట కొట్టారు, మగోళ్లకు డబల్ టికెట్ రేట్లు పెట్టి బాదుతున్నారు. కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన మహనీయుడు. అలాంటి పెద్దమనిషిని పట్టుకుని రేవంత్ రెడ్డి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడు. అసెంబ్లీలో పెన్షన్ ఎప్పుడు ఇస్తావ్ అని అడిగితే.. నీ లాగుల తొండలు తీస్తా అంటాడు. మహిళలకు 2500 అడిగితే పేగులు తీసి మెడలో వేసుకుంటా అంటాడు.

**తులం బంగారం ఏది అని అడిగితే గుడ్లు పీకి గోటీలు ఆడుతా అంటాడు. ఇదేనా ఒక ముఖ్యమంత్రి మాట్లాడే భాష?**

బతుకమ్మ చీరలు బంద్, క్రిస్టియన్-ముస్లింలకు ఇచ్చే కానుకలు బంద్, రైతుబంధు బంద్, దళిత బంధు బంద్, గొర్రెల పంపిణీ బంద్.. ఇలా కేసీఆర్ ఇచ్చినవన్నీ బంద్ పెట్టిన బంద్ల బాబు రేవంత్ రెడ్డి. ఇస్నాపూర్ మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి. మీకు అందుబాటులో ఉండే వాళ్లకు, మీ భవిష్యత్తును బాగా చూసుకునే వాళ్లకు ఓటెయ్యాలి.

మనకు అన్నం పెట్టిన కేసీఆర్ ని గుర్తు చేసుకోవాలి. ఇస్నాపూర్ అభివృద్ధి కొనసాగాలన్నా, పేదల సంక్షేమ పథకాలు మళ్ళీ రావాలన్నా కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి. మనల్ని మోసం చేసిన కాంగ్రెస్ కు బుద్ధి చెప్పండి.



## మాజీ ఎమ్మెల్యే మెచ్చాతో కలిసి అశ్వారావుపేటలో ఎంపీ వద్దిరాజు ఎన్నికల ప్రచారం

అశ్వారావుపేట (వాయిస్ టుడే) : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తదితర ప్రముఖులతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఎంపీ రవిచంద్ర శుక్రవారం మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు, పార్టీ నాయకులు ఉపాధ్యాయ సూర్య ప్రకాశరావు, కాసాని పద్మ తదితరులతో కలిసి కాలినడకన గల్లీ గల్లీ తిరిగి ఇల్లిల్లూ వెళ్లి కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఉత్సాహభరిత వాతావరణంలో రెండున్నర గంటల పాటు జరిగిన ప్రచారంలో పార్టీ శ్రేణులు, అభిమానులు గులాబీ జెండాలు చేతబట్టి, కండువాలు ధరించి పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు.ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే మెచ్చాలకు మహిళా కార్యకర్తలు పూలుజల్లి హారతులు పట్టారు.

## మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

### గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి



వరంగల్ ( వాయిస్ టుడే ) ఫిబ్రవరి 06 : ఈ నెల 11,న జరిగే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి శుక్రవారం పార్టీ కార్యాలయం లో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా లోని 12 మున్సిపాలిటీ ఎన్నికల బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించగలనీ ఉమ్మడి జిల్లా ప్రజానీకానన్నీ కోరారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటలకు కట్టుబడి బీసీలకు 42% మున్సిపల్ టికెట్లు ఇవ్వడం జరిగింది బిజెపి గాని టిఆర్ఎస్ గాని 42 శాతం బీసీలకు టికెట్లు ఇవ్వకుండా రెండు పార్టీలు బీసీలకు మోసం దగా చేశాయని అందుకే ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులు ఈ విషయాన్ని బిసి ప్రజానీకానికి తెలియజేస్తూ అందరూ కలిసి కట్టుగా పనిచేసి 12 మున్సిపాలిటీ లలో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించగలరని రాజనాల శ్రీహరి కోరారు. ఈ కార్యక్రమం లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్. అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# 'కేసీఆర్ చేసిన అభివృద్ధి చూసి కారు గుర్తుకు ఓటేయండి": ఎంపీ వద్దిరాజు

కొత్తగూడెం (వాయిస్ టుడే) : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర పాలనలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందింది అని గుర్తు చేశారు. మహానేత కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి ప్రజల ఆకాంక్షలను తీర్చారని, అభివృద్ధి మరియు సంక్షేమంలో పదేళ్ల సుపరిపాలన అందించారని కొనియాడారు. ఎంపీ రవిచంద్ర శుక్రవారం కొత్తగూడెం 22వ డివిజన్ సుజాతానగర్, 60వ డివిజన్ కూలీ లైన్, 55వ డివిజన్ గణేష్ టెంపుల్ ఏరియా, 58వ డివిజన్ హనుమాన్ బస్తీలలో మునిసిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సుజాతానగర్‌లో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు రాఘవ, మిగతా చోట్ల మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ సీతామహాలక్ష్మీ తదితరులతో కలిసి ప్రచారం జరిగింది. రావిచంద్ర మాట్లాడుతూ, కేసీఆర్ మార్గదర్శకత్వంలో, కే.టీ. రామారావు సహకారంతో వనమా వెంకటేశ్వరరావు కొత్తగూడెంను ప్రగతిపథాన పథంలో నడిపించారని తెలిపారు. సుమారు 3,000 కోట్లతో పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు. సెంట్రల్ డివైడర్, వీధి దీపాలు, పరిశుభ్రతా ఏర్పాట్లు, మెడికల్, నర్సింగ్ కాలేజీలు, పాల్వంచలో ఆధునిక కలెక్టరేట్ నిర్మాణం వంటి కీలకమైన అభివృద్ధి కార్యక్రమాలను రవిచంద్ర వివరించారు. రాజ్యసభ సభ్యుడు ఇప్పుడు ప్రజలకు అభివృద్ధిని మరింత చేరువ చేసేందుకు, కేసీఆర్ నాయకత్వంలో ఘన విజయం సాధించాలంటూ ఓటర్లను కారు గుర్తుకు ఓటేయమని కోరారు. ప్రచారంలో అభిమానులు గులాబీ జెండాలు, పూలుజల్లులు, నినాదాలతో ఘనంగా పాల్గొన్నారు.





**భువనగిరి పట్టణంలో భారతీయ జనతా పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కోసం పోచమ్మ వాడ 13వ వార్డులో జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో హైదరాబాద్ నుండి బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్, మల్కాజ్గిరి మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.**

- యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో... వాయిస్ టుడే ప్రతినిధి):-



**భువనగిరి పట్టణం 29వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినీగా పోటీ చేస్తున్న పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు ను..అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తదితరుల దృశ్యం.**

- యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో
(వాయిస్ టుడే ప్రతినిధి )



## బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్న బుట్టంగారి మాధవ రెడ్డికి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ ఎలా ఇచ్చింది..?

### బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 06: బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్న బుట్టంగారి మాధవ రెడ్డికి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ ఎలా ఇచ్చిందని బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్ ప్రశ్నించారు. శుక్రవారం కాచిగూడ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ పిటిషన్ వేసిన వ్యక్తి మాధవ రెడ్డి అని అన్నారు. మాధవ రెడ్డికి టికెట్ ఇవ్వటంతో బీసీ రిజర్వేషన్లకు మేము వ్యతిరేకమని బీఆర్ఎస్ రాజముద్రతో చెప్పినట్లైందని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా బీసీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం జాగృతి సహా బీసీ సంఘాలన్నీ పోరాటం చేస్తున్నాయి. ఎన్ని రోజులు పోరాటం చేసి, ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి 42 శాతం రిజర్వేషన్ల బిల్లు సాధించామని, కానీ బుట్టంగారి మాధవ్ రెడ్డి సహా మరొక వ్యక్తి దీనిపై పిటిషన్ వేసి అడ్డుకున్నారని ఆరోపించారు. హరీష్ రావుకు మాధవ్ రెడ్డి దగ్గరని, హరీష్ రావు పర్సనల్ లాయర్ తో ఈ కేసు వేయించారని ఆరోపించారు. తెలంగాణలో 56 శాతం ఉన్న బీసీల నోటికాడి బుక్క గుంజుకునే ప్రయత్నం చేసిన వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారని అన్నారు. బీఆర్ఎస్ కు అసలు బీసీల విషయంలో చిత్తశుద్దితో లేదని విమర్శించారు. బీసీలంతా బీఆర్ఎస్ పార్టీ వైఖరిని గమనించాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ పార్టీ మాధవ్ రెడ్డికి టికెట్ ఎందుకు ఇచ్చిందో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక కాంగ్రెస్ పరిస్థితి అయితే నవ్విపోదురుగాక నాకేటీ సిగ్గు అన్నట్లు ఉందన్నారు. ప్రజలు ఎవరినీ నమ్మాలో, ఎవరినీ నమ్మొద్దొ తెలియని పరిస్థితి నెలకొందన్నారు. బీసీలకు ఏటా 20 వేల కోట్లు బడ్జెట్ పెడతామని కాంగ్రెస్ చెప్పింది. కానీ గత రెండు బడ్జెట్‌లు కలిపి ఏడువేల కోట్లు కూడా నిధులు కేటాయించలేదన్నారు. బీసీ సబ్ ప్లాన్ సహా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సవరించుకోవటానికి ఈ బడ్జెట్ మంచి అవకాశమని అన్నారు. ఎన్నికలు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ పార్టీలు ఎలా వ్యవహరిస్తున్నాయన్నది ప్రజలు గమనించాలి. కార్యక్రమంలో బీసీ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు అభిలాష్ గౌడ్, బీసీ సంఘం స్టూడెంట్ గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ కార్తిక్ యాదవ్, బీసీ సంఘం నాయకులు బత్తిని బాలరాజ్, రాజ్ కుమార్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## కరీంనగర్ 9వ వార్డులో బీజేపీ గెలుపు కోసం గీతా మూర్తి ప్రచారం

కరీంనగర్, ఫిబ్రవరి 06: మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కరీంనగర్ 9 వ వార్డులో బీజేపీ అభ్యర్థి గాయత్రి దేవికి మద్దతుగా బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు కె.గీతా మూర్తి శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రచారం సందర్భంగా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని గీతా మూర్తి తెలిపారు. మహిళా నేతలు సుష్మిత, మానస, రమ్య, మమత, అంజలి దేవి, కరుణ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

### హమాలీ వర్కర్స్,ముస్లిం సోదరులను కలిసిన అరూరి



హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: వర్ధన్నపేట నియోజకవర్గ మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఓటర్లను కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వర్ధన్నపేటలోని 3వ వార్డు సభ్యులు గుజ్జా వీర రాఘవ రావు,7వ వార్డు సభ్యులు తిరుపతి సురేష్,8 వ వార్డు సభ్యులు బానోతు శ్రీనివాస్, 12వ వార్డు సభ్యురాలు గుండె స్వప్నిక- రవి లకు మద్దత్తు గా ఎన్నికల ప్రచారంలో అరూరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ గిడ్డంగి లో పనిచేస్తున్న హమాలీ వర్కర్స్ ను మరియు దర్గా వద్ద ముస్లిం సోదరులను మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ కోరారు.

## కబ్జా చేసి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

### డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన కాలనీ పెద్దలు



కాజీపేట, వాయిస్ టుడే: కాజీపేట మండలం 46వ డివిజన్ మడికొండ ఎస్సీ కాలనీ మహిళా కమ్యూనిటీ హాల్ ప్రక్కన ఉన్న రోడ్డు భాగాన్ని చుట్టుపక్కల ఉన్నవారు కబ్జా చేసి అభివృద్ధికి అడ్డుపడుతున్నారని తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం మడికొండ జాంబవ సంఘం అధ్యక్షుడు వస్కుల ఆనంద్ ఆధ్వర్యంలో కాలనీవాసులు మరియు కమిటీ సభ్యులు కాజీపేట మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ డాక్యుమెంట్స్ క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తక్షణమే కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన కమిషనర్ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే వివాదాస్పద స్థలం వద్దకు వెళ్లాలని కమిషనర్ సూచించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. కమిషనర్ ను కలిసిన వారిలో కుల సంఘపెద్దలు, కాలనీవాసులు,వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మనసేత్రం
హైదరాబాద్
శనివారం 7 ఫిబ్రవరి 2026



## అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం సభ - యూనిఫామ్స్ పంపిణీ

**గర్భిణీలు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి: సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణ రెడ్డి**

చిగురుమామిడి, ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే) : చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలోని అంగన్వాడి మూడవ కేంద్రంలో శుక్రవారం సభ ఘనంగా నిర్వహించగా, ఈ సందర్భంగా చిన్నారులకు యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణ రెడ్డి గారు మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలు, బాలింతలు తప్పనిసరిగా సరైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గర్భిణీ స్త్రీలకు అన్ని రకాల వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నదని, అందుకే గవర్నమెంట్ హాస్పిటల్స్‌లోనే డెలివరీలు చేయించుకోవాలని ఆయన తెలిపారు. తక్కువ బరువు ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారికి అధిక ప్రోటీన్లు కలిగిన పోషకాహారం అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. అంగన్వాడి కేంద్రంలోనే కాకుండా, ఇంటి వద్ద కూడా పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్వాడి కేంద్రం ద్వారా అందించే ఆహారం పోషక విలువలు అధికంగా కలిగినదైనందున, పిల్లలకు దాన్ని తప్పకుండా తినిపించాలన్నారు. చిన్న వయస్సులోనే సరైన పోషణ లభిస్తే, పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు యూనిఫామ్స్ అందజేయడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెడబోయిన రాజు, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు వంతడుపుల దిలీప్, పెసరి రాజా కృష్ణ, మంతెన ప్రియాంక, ఎనగందుల రాజేశ్వరి, నిర్మల జ్యోతి పాల్గొన్నారు. అలాగే అంగన్వాడి టీచర్లు బి. శోభ, వి. రాజమణి, ఆశా కార్యకర్తలు శోభ, శ్వేత, స్రవంతి, అనురాధ, తల్లులు, పిల్లలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నాగుల సాంబయ్య గౌడ్ నియామకం



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి ఫిబ్రవరి 6బోయిన్ పల్లి మండలంలోని వరద వెల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు నాగుల సాంబయ్య గౌడ్ ను తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియామకమైన నాగుల సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని రాష్ట్రంలో ఉన్న వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి నిరంతరం ముందుండి వారికి సేవకుడిలా ఉంటానని పేర్కొన్నారు. తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నా నియామకానికి కృషి చేసిన రాష్ట్ర వార్డు సంక్షేమ సంఘం అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెస్రం నర్సయ్య, కు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సభ్యుల సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్ని జిల్లా లలో త్వరలో కమిటీలు వేస్తామని తెలిపారు.

## అదుపుతప్పిన ద్విచక్ర వాహనం.. - పరిస్థితి విషమం



కోనరావుపేట, ఫిబ్రవరి 06 ( వాయిస్ టుడే) : కోనరావుపేట మండల పరిధిలోని బావుసాయిపేట గ్రామంలో విషాదం నెలకొంది. స్థానికుల సమాచారం ప్రకారం, బావుసాయిపేట గ్రామానికి చెందిన సంజయ్ (34) తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా, మార్గమధ్యలో ఒక్కసారిగా వాహనం అదుపుతప్పింది. ఈ క్రమంలో బైక్ పై నుంచి కింద పడిపోవడంతో తలకు మరియు శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి పరిస్థితి విషమంగా ఉండడంతో గమనించిన గ్రామస్తులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## ప్రభుత్వ మైనింగ్ పర్మిషన్లు బేకర్త చేస్తూ.. పరిశ్రమలో మట్టి దందా

**పట్టించుకోని మైనింగ్ ఇరిగేషన్ అధికారులు**



నర్సాపూర్ (వాయిస్ టుడే): నియోజకవర్గ పరిధిలోని హత్నూర మండల్ తురకల ఖానాపూర్ గ్రామ శివారులో గల ప్రైవేట్ పరిశ్రమ లో అక్రమంగా మట్టిని డంపింగ్ చేయడం జరుగుతుంది. పారిశ్రామిక యజమానం గత వారం రోజుల నుండి అక్రమ మట్టి రావణ చేస్తూ దోపిడీకి సుమారు 20 నుండి 30 ట్రిప్పర్ల వరకు నడుపుతూ ప్రభుత్వానికి పెద్దగా గండి కొడుతున్న పట్టించుకోని అధికారులు కొందరు మట్టి బకాసురులు మట్టిని అక్రమ రావణ చేస్తూ ప్రభుత్వానికి పెద్ద గండి కొడుతున్న చూసి చూడనట్టుగా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఇరు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మట్టిని తరలిస్తున్న అక్రమార్కుని పై క్రిమినల్ కేసులు పెట్టి చట్టరీతి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు . ఇదిలా ఉండగా రాజకీయ నాయకుల అండదండలతో పారిశ్రామిక యాజమాన్యం ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తిస్తున్నారని ఇరు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఈ అక్రమ మట్టి దాదా కు అడ్డుకోట వేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# మోసపోకండి... గోసపడకండి





**- కాంగ్రెస్ బిజెపిలకు ఓటుతో బుద్ధి చెప్పండి**

**- రాజన్న ఆలయానికి ఒక్క రూపాయయినా ఇచ్చారా**

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

వేములవాడ,ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే) మున్సిపల్ ఎన్నికల్లో మరోసారి ప్రజలు మోసపోయి గోసపడవద్దని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. వేములవాడ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ... 2023లో కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు నమ్మి ప్రజలు ఓటు వేసి రెండు సంవత్సరాలుగా గోసపడుతున్నారన్నారు. ఇప్పటికే మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టారని, 6 గ్యారంటీలు అమలు చేయడం లేదన్నారు. కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఎందుకు ఇవ్వడం లేదని, మహిళలకు 2500 ప్రతినెల ఎందుకు ఇవ్వడంలేదని, విద్యార్థినిలకు స్కూటీలు ఇచ్చారా అని ప్రశ్నించారు. వేములవాడ పట్టణంలో టిఆర్ఎస్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో 70 లక్షల మంది రైతులకు రైతుబంధు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు అని ప్రజలను మోసగిస్తుందని మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తూ మగవారికి డబుల్ చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్, బిజెపి వాళ్లు ఓట్లకు వేలాది రూపాయలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని బరాబర్ డబ్బులు తీసుకోండని, ఓటు మాత్రం కారు గుర్తుకు వేయాలన్నారు.

**రాజన్న ఆలయానికి బండి ఒక్క రూపాయి అయినా తెచ్చాడా..**

వేములవాడ రాజన్న ఆలయానికి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ ఒక్క రూపాయి అయినా అభివృద్ధి కోసం కేటాయించార అని కేటీఆర్ ప్రశ్నించారు. రెండుసార్లు ఎంపీగా గెలిపిస్తే ఒక్క రూపాయి కూడా ఆలయ అభివృద్ధికి కేటాయించలేదన్నారు. ఎన్నికలు రాగానే దేవుళ్ళ పేరుతో రాజకీయం చేయడం బండికి అలవాటైపోయిందన్నారు. ఏం చేశారని బిజెపికి ఓటు వేయాలో ప్రచారంలో బీజేపీ నాయకులను నిలదీయాలన్నారు.



## ఫిబ్రవరి 12 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**ఐసిడిఎస్, సిడిపిఓ, సూపర్వైజర్లకు మల్లేశ్వరి కి సమ్మె నోటీస్ అందజేశారు**

**CITU జిల్లా అధ్యక్షులు గోవింద్ రాజ్**

మక్తల్ ఫిబ్రవరి 06 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ పట్టణ కేంద్రంలో శుక్రవారం రోజు శిశు సంక్షేమ అధికారులకు సమ్మె నోటీస్ అందజేశారు. కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, పారిశ్రామిక, విధానాల వల్ల ప్రజలు కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు 2026 ఫిబ్రవరి 12 న ఒకరోజు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. 29 కార్మిక చట్టాలు స్థానంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లు అమల్లోకి తెస్తూ 2025 నవంబర్ 21 న ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం 2025 ను ఉపసరించుకోవాలని, పేదలకు పని గ్యారంటీ కల్పిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కొనసాగించాలని, పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు 26వేల రూపాయలు పెంచాలని తదితర డిమాండ్లపై కేంద్ర కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామని హక్కులపై నిరంతర దాడి కొనసాగించేందుకు తీసుకొస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కేంద్ర బిజెపి తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడులకు వ్యతిరేకంగా కనీస వేతనాలు అమలుకై ఫిబ్రవరి 12న పోరుబాట పట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ణ విజయలక్ష్మి మక్తల్ ప్రాజెక్టు అధ్యక్షురాలు, నాయకురాలు ఎస్ మంజుల, యూనియన్ జిల్లా నాయకురాలు రాధిక, శ్రీలత, నరసింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చేతు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలి

**మాచునూరిలక్ష్మీరాజు యాదవ్ ఐదవ వార్డు నర్సాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లక్ష్మి రాజు యాదవ్**



నర్సాపూర్ (వాయిస్ టుడే): 11వ తేదీ జరిగే మున్సిపల్ ఎన్నికల్లో 5వ వార్డు అక్క చెల్లెలు అన్నదమ్ములు ప్రజలు తనను ఆశీర్వదించాలని ఐదవ వార్డు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని నర్సాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఐదవ వార్డ్ అభ్యర్థి లక్ష్మీ రాజు యాదవ్ అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చేస్తున్నటువంటి అభివృద్ధి చూసి ప్రజలు ఆదరించాలని వారు తెలిపారు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి సహకారంతో 5వ వార్డు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఐదవ వార్డ్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి లక్ష్మి రాజు యాదవ్ తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 24 నెలలుగా పెండింగ్‌లో ఉన్న అడ్మినిస్ట్రేటివ్ బిల్లుల తక్షణం విడుదల చేయాలి

**మరియు MCC సిబ్బంది ఎదుర్కొంటున్న అడ్మిన్ ఆర్థిక సమస్యపై ఈ నెల 16 నుండి షట్ డౌన్ కార్యక్రమం**



కోనరావుపేట, ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే) : గత 24 నెలలుగా మా వీజజ లో పెండింగ్‌లో ఉన్న అడ్మినిస్ట్రేటివ్ బిల్లులను మల్లి మల్లి అభ్యర్థన చేసినప్పటికీ, అధికారులకు మరియు గౌరవ PR&RD మంత్రివర్యులు పలుమార్లు ఆదేశించినప్పటికీ బిల్లుల విడుదలపై ఎలాంటి స్పందన లేకపోవడం అత్యంత నిరాశకు గురిచేస్తోంది. CO&AA\T మరియు ఇతరులు గత ఆర్థిక సంవత్సరం నుండి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకూ తమ జీతాలనుండే స్టేషనరీ, ప్రింటింగ్ మెటీరియల్, క్యాట్రిడ్జ్, 7 రిజిస్టర్స్, విద్యుత్ బిల్లు, ఇంటర్నెట్, నీటి బిల్లు వంటి అవసరాలకు ఖర్చు చేయడం జరిగింది. ఇందులో 90% వరకు ఖర్చు కంప్యూటర్ ఆపరేటర్-ఎబిఎ-అకౌంట్స్ అసిస్టెంట్స్ భుజాలపై పడింది. చిన్న జీతాలు, అవి కూడా ఆలస్యంగా రావడం వల్ల వారు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిపోయారు. ఇది మేము స్పష్టంగా తెలియజేస్తున్నాము.

2024-25 మరియు 2025-26 ఆర్థిక సంవత్సరంలో మా జీతాలనుండి అడ్మినిస్ట్రేటివ్ ఖర్చు చేసి వ్రీణూ అకౌంట్, వ్యక్తిగత అకౌంట్ (స్టాఫ్) మరియు వెండర్ అకౌంట్స్ కు వేజ్ లిస్టు లు జనరేట్ చేయడం జరిగింది. ఇట్టి బిల్లులు ఎటువంటి ఆంక్షలు లేకుండా తక్షణమే విడుదల చేయగలరని కోరుతున్నాము. ఇకపై ఫిబ్రవరి 2026 నుండి అన్ని స్టేషనరీ, మస్టర్లు ప్రింటింగ్, పే స్లిప్పులు, పే ఆర్డర్లు, 7 రిజిస్టర్లు, క్యాట్రిడ్జ్ లు, ఇంటర్నెట్, విద్యుత్, నీటి బిల్లులతో పాటు, ఆఫీస్ అవసరాలన్నింటినీ మా జీతాలనుండి ఖర్చు చేయలేము అని విజ్ఞప్తి చేయుచున్నాము.

అడ్మిన్ డబ్బులు ఇవ్వని కారణంగా సామాజిక తనిఖీ చేసినప్పుడు పే స్లిప్ లు ఇవ్వలేదని సోషల్ ఆడిట్ వారు మమ్మల్ని బాధ్యులుగా చేయకూడదు. కావున తమకు వినయపూర్వకంగా తెలియజేయునది ఏమనగా, తేదీ 22.01.2026న గౌరవ డైరెక్టర్, పంచాయతీరాజ్ ఄ గ్రామీణాభివృద్ధి గారికి వినతిపత్రం సమర్పించడమైనది. ఆ వినతికి సంబంధించి ఇవ్వబడిన 15 రోజుల గడువు పూర్తయినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి పురోగతి కనిపించలేదు. అందువల్ల, తేదీ 16.02.2026 రోజు నుండి షట్ డౌన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియ జేయుచున్నాము.

# RTIH ఉషారామా ఇంజినీరింగ్ కళాశాల మధ్య అవగాహన ఒప్పందం



విజయవాడ: ఎనికేపాడు, విజయవాడలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (RTIH) మరియు ఉషారామా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మధ్య 06-02-2026న అవగాహన ఒప్పందం (MOU) కుదిరింది. విద్యార్థుల్లో నవోత్తేజం, ఉపాధి సృష్టి మరియు స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించడమే ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశ్యం.

ఈ MoU RTIH ముఖ్య కార్యనిర్వాహక అధికారి శ్రీ జి. కృష్ణన్ , పార్ట్‌నర్‌షిప్స్ హెడ్ శ్రీ నందన్ టాండి గారు, ఉషారామా కాలేజ్ ప్రిన్సిపాల్ డా. జి.వి.కె.ఎస్.వి. ప్రసాద్ మరియు డా. కె.వి. శివ కుమార్ బాబు (అసోసియేట్ ప్రొఫెసర్) సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా RTIH అధికారులు గౌరవనీయ ముఖ్యమంత్రి "ఒక కుటుంబం -- ఒక వ్యాపారవేత్త" అనే దృక్పథాన్ని వివరించారు. రాష్ట్ర అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. RTIH విజయవాడ బృందం కళాశాల విద్యార్థులు మరియు అధ్యాపకులకు స్టార్టప్ ఇంక్యుబేషన్, నవోత్తేజానికి మెంటారింగ్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ అభివృద్ధి కార్యక్రమాలు, మీూవీజు మద్దతు, పరిశ్రమల అనుసంధానం వంటి ాు×ం కార్యక్రమాలపై వివరించారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులకు స్టార్టప్ అవకాశాలు, మార్గదర్శకత్వం, పరిశ్రమ అనుభవం లభించనుంది. ఈ కార్యక్రమంలో RTIH విజయవాడ ప్రోగ్రామ్ అసోసియేట్స్ -- పార్ట్‌నర్‌షిప్ టీమ్ సభ్యులు శ్రీ కోటేశ్వరరావు మాదాసు, శ్రీ అనిల్ కుమార్ మున్నంగి, గౌష్య, సురేఖ పాల్గొన్నారు. ఈ ఒప్పందం విజయవాడ ప్రాంతంలో నవోత్తేజం మరియు వ్యాపార వాతావరణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగుగా నిలుస్తుందని కళాశాల యాజమాన్యం అభిప్రాయపడింది.

## మంజీరా నది నుండి అక్రమంగా ఇసుక తరలించి నిల్వచేసిన ఇసుకను సీజ్ చేసిన హత్నూర తాసిల్దార్ పర్వీన్ షేక్

హత్నూర సబ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి



నర్సాపూర్ (వాయిస్ టుడే) : హత్నూర మండలం పరిధిలోని పన్నాల గ్రామ శివారులోని మంజీర నది పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారం తెలుసుకున్న హత్నూర తాసిల్దార్ రెవెన్యూ శాఖ అధికారులు హత్నూర సబ్ ఇన్స్పెక్టర్ ఇసుక నిల్వలను సీజ్ చేశారు ఈ సందర్భంగా హత్నూర తహసిల్దార్ పర్వీన్ షేక్ మాట్లాడుతూ హత్నూర మండలంలోని ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై కఠిన చర్యలు తోపాటు క్రిమినల్ కేసులు చేస్తామని  ఆమె తెలిపారు అక్రమంగా ఇసుక ఎవరైనా తరలిస్తే తమ దృష్టికి తేవాలని హత్నూర తహసిల్దార్ తెలిపారు కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవిబాబు ఆయనతోపాటు మండల్ రెవెన్యూ సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు ఎస్పీ జానకి షర్మిల



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 6: నిర్మల్ మున్సిపల్ ఎన్నికల వేళలో సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల హెచ్చరించారు ఇటీవల సోషల్ మీడియాలో వైరలైన ఒక ఘటనపై ఎంబయం వాడ అభ్యర్థి నాంపల్లి ఎమ్మెల్యే పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు శాంతిభద్రలకు జాతం కల్పిస్తే ఇవన్నీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు బాధ్యతయుతంగా ఉండాలని తప్పుడు ప్రచారాన్ని వైరల్ చేయకూడదని సూచించారు.

## పోలీస్ శాఖలో 42 ఏళ్ల కలీం సేవలు



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 6: నిర్మల్ పోలీస్ శాఖలో 1984లో హోమ్ గార్డ్ గా చేరి 42 ఏళ్ల పాటు పోలీస్ శాఖకు విశేష సేవలు అందించిన ఎస్కే కలీం శుక్రవారం పదవి విరమణ పొందారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆయనను పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా విధులు నిర్వహిస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు కలీమ్ సేవలను జిల్లా పోలీసు యంత్రాంగం కొనియాడింది ఈ కార్యక్రమంలో ఎస్పీ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ కోదండ రామాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

చైర్మన్ నక్కని కోటయ్య, వైస్ చైర్మన్ గడ్డం కుమారస్వామిగౌడ్‌కు సత్కారం

ముదిగొండ ఫిబ్రవరి 06 వాయిస్ టుడే : ముదిగొండ మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామంలో వెలసిన శ్రీ కోదండ రామాలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ నూతన చైర్మన్‌గా నక్కని కోటయ్య, వైస్ చైర్మన్‌గా గడ్డం కుమారస్వామి గౌడ్ బాధ్యతలు స్వీకరించారు.ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం సర్పంచ్ సలీమా ఖాసీం, మాజీ ఎంపీటీసీ నానబాల కిరణ్ మాధవి,ఉప సర్పంచ్ పెద్దపొంగు రమాదేవి నాగేశ్వరరావు నూతన కార్యవర్గాన్ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు చైర్మన్ నక్కని కోటయ్య మరియు వైస్ చైర్మన్ గడ్డం కుమారస్వామి గౌడ్ లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... గ్రామస్తులందరి సహకారంతో నూతన కమిటీ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆమె ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గ్రామంలో భక్తిభావం పెంపొందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ఆలయ అర్చకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రెండవ రోజు కొనసాగిన న్యాయవాదుల నిరసనలు

హుజూర్ నగర్ పిబ్రవరి6 (వాయిస్ టుడే ప్రతినిధి): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల కు చెందిన మహిళా యువ న్యాయవాది స్వప్న హత్యను ఖండిస్తూ విధుల బహిష్కరణ, నిరసన కార్యక్రమాలు చేపట్టిన న్యాయవాదులు రెండవ రోజు శుక్రవారం కూడా తమ విధులను బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. హత్యా నిందితులను వెంటనే అరెస్టు చేయాలని విధి నిర్వహణలో అలసత్వం వహించిన పోలీస్ అధికారులపై కూడా తగు చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే రూపొందించి అమలు పర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా తమ ఆందోళనలను ఉధృతం చేస్తామని న్యాయవాదులు హెచ్చరించారు. అంతకుముందు న్యాయమూర్తులకు బార్ అసోసియేషన్ తీర్మాన కాపీలను అందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, చనగాని యాదగిరి, నట్టే సత్యనారాయణ, కమతం నాగార్జున, ఉప్పల గోపాలకృష్ణమూర్తి, కొట్టు సురేష్, చక్రాల వెంకటేశ్వర్లు, రామలక్ష్మారెడ్డి, శ్రీను నాయక్, శంకర్ నాయక్, సాముల సురేందర్ రెడ్డి,  పచ్చిపాల గురుమూర్తి, అడవి రాముడు, శివకృష్ణ యాదవ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



## కొన్నాలలో డ్వాక్రా సమైక్య భవన నిర్మాణంనికి భూమి పూజ చేసిన సర్పంచ్ సుజాత సత్యం

నర్సాపూర్  (వాయిస్ టుడే) : హత్నూర మండల పరిధిలోని కొన్యాల గ్రామంలో శుక్రవారం నాడు డాక్రా సమైక్య భవన నిర్మాణానికి కొన్యాల సర్పంచ్ సుజాత సత్యం భూమి పూజ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత సత్యం మాట్లాడుతూ డాక్రా మహిళలకు భవనం లేక ఇబ్బంది పడుతున్న నందున వారికి డ్వాక్రా సమైక్య భవన నిర్మాణం భూమి పూజ చేయడం జరిగిందని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ విట్టల్ రెడ్డి కొన్నెల గ్రామ ఉపసర్పంచ్ మల్లేష్ గ్రామ కార్యదర్శి వార్డు సభ్యులు డాక్రా మహిళలు పాల్గొన్నారు.



## సామాజిక న్యాయం బిఎస్పీ తోనే సాధ్యం మున్సిపల్ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులను ఆశీర్వదించండి

అడ్వకేట్ జగన్ మోహన్ బీఎస్పీ నిర్మల్ జిల్లా అద్యక్షులు

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 6: నిర్మల్ మున్సిపాలిటీ లో బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని బీఎస్పీ నిర్మల్ జిల్లా అద్యక్షులు అడ్వకేట్ జగన్ మోహన్ నిర్మల్ పట్టనంలోని సోఫినగర్ లో మీడియా తో మాట్లాడుతూ...నేడు రాష్ట్రము లో అధికారం లో ఉన్న కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయిందని అన్నారు. ఇందిరమ్మ చీరలు,ఉచిత బియ్యంతో ప్రజల జీవితాలు మారలేవు అని అన్నారు. విద్య,వైద్యం,ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. బీసీ లకు 42% రిజర్వేషన్ లు కల్పిస్తామని బీసీ ల ఓట్ల తో అధికారం లోకి వచ్చి బీసీలకు మోసం చేసారన్నారు.అసలు బీసీలకు రిజర్వేషన్ లు ఇవ్వడం కాంగ్రెస్ బీజేపీ లకు ఇష్టం లేదు అన్నారు.అందుకే 1950 నుండి 1993 వరకు బీసీలకు ఏ రంగం లో రిజర్వేషన్ లు కల్పించాలేదన్నారు.బీఎస్పీ పోరాటం వలన బీసీ లకు ఇప్పుడున్న 27% రిజర్వేషన్ లు అమలు అవుతున్నాయి అని ఈ సందర్భంగా గుర్తు చేశారు, బీసీలకు బీఎస్పీతోనే సామజిక న్యాయం,  రాజ్యాధికారం సాధ్యం అని అన్నారు. ఇప్పుడు జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో నిర్మల్ మున్సిపాలిటీ లో బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో 14వ వార్డు అభ్యర్థి ఎస్కే లక్ష్మీ యాదవ్ మరియు బిఎస్పి ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కరీకారి రాజేష్ మరియు ప్రధాన కార్యదర్శి సంజయ్, కన్వీనర్ సంజీవ్, మహిల నాయకులు ఇంద్ర,లక్ష్మి, నరసవ్వ, తిరుమల తదితరులు పాల్గొన్నారు.



## నిర్మల్ అభివృద్ధికి ' జాడు  పట్టాల్సిందే

మున్సిపల్ బరిలో రేష్మ హలీం గెలుపు కోసం ఇంటింటి ప్రచారం

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 6: నిర్మల్: మున్సిపాలిటీలో దశాబ్దాల నాటి అలుపెరగని సమస్యలకు చెక్ పెట్టాలంటే మార్పు రావాలని, సామాన్యుడికి అండగా నిలిచే పాలనే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ూూూా) అభ్యర్థి రేష్మ హలీం తన ప్రచారాన్ని ఉధృతం చేశారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన 'గడప గడపకు ఆమ్ ఆద్మీ' కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్  స్వయంగా పాల్గొని రేష్మ హలీం  మద్దతుగా ఓట్లు అభ్యర్థించారు.

### ప్రచారంలోని ప్రధాన అంశాలు

మార్పుకు నాంది –నిర్మల్ గడ్డ ఏళ్లుగా పాలించిన పార్టీల ఓట్లు దండుకోవడం తప్ప, సామాన్యుడి కనీస అవసరాలను విస్మరించాయని సయ్యద్ హైదర్  విమర్శించారు. ఢిల్లీ, పంజాబ్ తరహా అభివృద్ధి నిర్మల్‌లో సాధ్యం కావాలంటే ూూూా రావాలని ఆయన పిలుపునిచ్చారు.  విద్యావంతురాలైన అభ్యర్థి రేష్మ హలీం గ కేవలం అభ్యర్థి మాత్రమే కాదు, ప్రజల కష్టాలను స్వయంగా చూసిన వ్యక్తి. ఆమె లాంటి విద్యావంతులు చట్టసభల్లోకి వెళ్తేనే సామాన్యుడి గొంతు వినిపిస్తుందని నాయకులు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం: ప్రచారంలో భాగంగా స్థానికులు ఎదుర్కొంటున్న మురుగునీటి పారుదల, తాగునీటి ఎద్దడి వంటి తీవ్రమైన సమస్యలను రేష్మ హలీం గారు అడిగి తెలుసుకున్నారు. గెలిచిన వెంటనే డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తా" అని ఆమె హామీ ఇచ్చారు.

అవినీతి రహిత పాలన మున్సిపల్ ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా, పైసా ఖర్చు లేని పారదర్శక పాలన కోసం 'పొరక' గుర్తుకే ఓటు వేయాలని కోరారు. నేను మీ ఇంటి ఆడబిడ్డను. మీ కష్టాల్లో తోడుంటాను రేష్మ హలీం ప్రచారంలో భాగంగా అభ్యర్థి రేష్మ హలీం  భావోద్వేగంగా మాట్లాడుతూ.. "నేను ఈ ప్రాంతం ఆడబిడ్డగా మీ ముందుకు వస్తున్నాను. అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేని రోజు రావాలి. సామాన్యుడికి పనులు జరగాలంటే అది కేవలం ఆమ్ ఆద్మీ పార్టీతోనే సాధ్యం. మీ అమూల్యమైన ఓటును 'పొరక' గుర్తుకు వేసి నన్ను ఆశీర్వదించండి." ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొని రేష్మ హలీం  గెలిపించాలని కోరుతున్నారు.

## క్రైస్తవుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

మున్సిపల్ ఎన్నికల్లో అండగా నిలవాలి ఊట్కూరి రాజు పిలుపు



హుజూర్ నగర్ ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారధ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవ మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని పాస్టర్ ఊట్కూరి రాజు కొనియాడారు. హుజూర్ నగర్ పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవుల పక్షపాతిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. క్రైస్తవులకు ముఖ్యమైన పండుగ అయిన క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చొరవతో గతంలో ఎన్నడూ లేని విధంగా, ప్రతి అర్హత కలిగిన చర్చికి మందిరాల అలంకరణ, లైటింగ్ మరియు సున్నం వేయడం కోసం ?30,000 చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడం గర్వకారణమని అన్నారు.ఎటువంటి వివక్ష లేకుండా క్రైస్తవ సమాజానికి తోడ్పాటును అందిస్తూ, ప్రభుత్వం వారి ఆచార వ్యవహారాలకు గౌరవం ఇస్తోందని తెలిపారు.క్రైస్తవుల పట్ల ఇంతటి ప్రేమను, సహకారాన్ని ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మున్సిపాలిటీ ఎన్నికల్లో పూర్తి స్థాయిలో అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. క్రైస్తవ సోదరులు, పాస్టర్లు,, బిషప్పులు  అందరూ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వానికి మద్దతు తెలియజేయాలని కోరారు.

## ఇందిరా మహిళా శక్తి చీరలో అమ్మవారి దర్శనం



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 6 : నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు భక్తులకు విశేష రూపంలో దర్శనమిచ్చారు మహిళా సాధికారతకు ఆత్మగౌరానికి తీవ్రంగా ఏడ్చే ఇంద్ర మహిళా శక్తి చీరతో అమ్మవారిని అర్చకులు అత్యంత భక్తి శ్రద్ధతో అలంకరించారు ఈ అపూర్వ అలంకరణను వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తల్లి వచ్చారు మహిళల ఆర్థిక సవలంబులను ప్రోత్సహిస్తూ దైవ కార్యములో ప్రతిబింబం చేశారు ఈ కార్యక్రమం ఉద్దేశం ఈ అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
శనివారం 7 ఫిబ్రవరి 2026



## నేరేడుచర్లలో పోలీసుల కవాతు

**స్వేచ్ఛాయుత ఎన్నికలే మా లక్ష్యం నిర్భయంగా ఓటు వేయండి**

**ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు: సి.ఐ. చరమంద రాజు**

హుజూర్ నగర్ ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే ప్రతినిధి) సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని హుజూర్‌నగర్ సి.ఐ. చరమంద రాజు పేర్కొన్నారు. నేరేడుచర్లలో జరిగిన కవాతు లో భాగంగా నేరేడుచర్ల, గరిడేపల్లి, మరియు పాలకవీడు ఎస్.ఐలతో కలిసి ఆయన భారీ పోలీసు కవాతు నిర్వహించారు.ఈ సందర్భంగా సి.ఐ. పలు కీలక అంశాలను వెల్లడించారు.ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా లేదా మద్యం, డబ్బు వంటి ఆశలు చూపి ప్రభావితం చేయాలని చూసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికల సమయంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు.రాజకీయ నాయకులు ఎవరైనా ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ప్రజాస్వామ్య పండుగలో పాల్గొనాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నారని ఈ కవాతు ద్వారా భరోసా కల్పించారు.




## సుమిత్రా కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

ఝరాసంగం ఫిబ్రవరి 06 (వాయిస్ టుడే) : ఝరాసంగం మండలం మెదపల్లీ గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ కొల్లూర్ అరుణ నరేందర్ రెడ్డి. ఆధ్వర్యంలో జహీరాబాద్ సుమిత్రా కేర్ హాస్పిటల్ వారు ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు నిపుణ వైద్యుల ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. కంటి సమస్యలపై అవగాహన కల్పిస్తూ, ముందస్తు చికిత్స ప్రాముఖ్యతను వైద్యులు వివరించారు. గ్రామంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించిన సుమిత్రా కేర్ హాస్పిటల్ వైద్య బృందానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిలాష్ రెడ్డి. ఉప సర్పంచ్. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాసేవ కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

**రాష్ట్ర మైనారిటీ సంక్షేమా శాఖ మంత్రివర్యులు మహమ్మద్ అజారోద్దీన్**

**ఎంపీ.సురేష్ కుమార్ షెట్కార్, ఇండస్ట్రియల్ ఛైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి**

ఝరాసంగం ఫిబ్రవరి 06 ( వాయిస్ టుడే): జహీరాబాద్ పంచాయతీ ఎన్నికల మాదిరిగానే మునిసిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని మాజీ మంత్రివర్యులు డా॥ఏ.చంద్రశేఖర్. ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నాడు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా వారు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం జరిగింది. పంచాయతీ ఎన్నికల మాదిరిగానే మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి ప్రభుత్వానికి తమ మద్దతు తెలపాలని కోరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టణ అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే గత పాలకులు చేయని అభివృద్ధిని చేసి చూపించామని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమని రేవంత్ రెడ్డి సర్కార్పించిందని ఆయన చెప్పారు. అధికార పార్టీ వాళ్ళనే కౌన్సలర్లను గెలిపిస్తే వార్డుల అభివృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. ప్రజా సేవే లక్ష్యంగా పనిచేయడానికి మీ ముందుకు వస్తున్నా అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని వారు కోరారు. మరియు ప్రచారంలో భాగంగా ఈద్గా దర్గాలో చద్దార్ సమర్పించి దర్శించుకుని, జామ మస్జీద్ లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఎన్నికల కర పత్రాలను పంచుతూ అభ్యర్థులకు మద్దతు తెలపడం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కండేం.నర్సింలు , మాజీ ఇండస్ట్రియల్ ఛైర్మెన్ తన్వీర్ , కాంగ్రెస్ నాయకులు ఉజ్వల్ రెడ్డి గారు,మరియు వార్డ్ కౌన్సలర్ అభ్యర్థులు పాల్గొనడం జరిగింది.

# నిర్మల్ మున్సిపల్ వీధుల్లో రాజకీయ గెలుపు గుర్రాల పందెం పరుగులు

**రాజకీయ చదరంగంలో గెలుపెవరిదో.. మలుపేవరిదో**

**పోరులో వార్డులే లక్ష్యంగా గెలుపు గుర్రాలపైనే నేతల గురి**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 6: నిర్మల్ జిల్లా లో ఖానాపూర్ బైంసా మునిసిపల్ ఎన్నికల పోరులో రాజకీయ పార్టీల నేతలు అధికార పీఠం కోసంతహతహలాడుతూనా వివిధ పార్టీలు. భవితవ్యంపై ఎవరి వ్యూహం వారిదే.. ఎవరి ధీమా వారిదే.. నిర్మల్ జిల్లాలోని మున్సిపల్ గద్ద పై సాగుతున్నరాజకీయ భూకంపం,ఓటు ఎవరికి పట్టం కడుతుందో.. ఎవరికి గండం తెస్తుందో.? ప్రజా క్షేత్రంలో తేలనుంది. మున్సిపల్ వీధుల్లో రాజకీయ జాతరలు. ఆశల గుర్రాలు పందెంలో పరిగెడుతున్నాయి. గెలుపు జెండా కోసం తహ,తహలాడుతున్న వివిధ పార్టీల నేతలు నాయకులు, ప్రజా క్షేత్రంలో ఓటు ద్వారా ఇచ్చిన తీర్పుమురిపించ ేవారెవరినో ముంచేదెవరినో..? ఓటరు తీర్పే శిరోధార్యం రాజకీయ భవితవ్య చదరంగంలో గెలుపెవరిదో.. మలుపెవరిదో...ప్రజా క్షేత్రంలో తేలనుంది,,

అధికార పీఠం ఒకటే.. ఆశావహులు ఎందరో..? పలు మున్సిపాలిటీలో ముదిరిన పోరు. ఎవరి పట్టు వారిదే..

ప్రజా క్షేత్రంలో తేలనుంది అసలు సిసలు దమ్ము. ఓటరు వేయనున్నాడు గెలుపు ముద్ర. మున్సిపాలిటీ యుద్ధంలో వార్డులే లక్ష్యం,గెలుపు గుర్రాలపైనే నేతల గురి. పార్టీల మధ్య ప్రతిష్టాత్మక పోరు.. తెలంగాణ గడ్డపై మొదలైంది అసలు సిసలు హోరు. వార్డు వార్డులో వ్యూహాల వేడి..

**మున్సిపల్ పీఠంపై ఎవరిది జోడి?**

ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో వాడి వేడి కనిపిస్తోంది. ప్రస్తుతం నియోజకవర్గాల్లో ఎక్కడ చూసినా రాజకీయ ప్రకంపనలే కనిపిస్తున్నాయి. పలు పార్టీల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు ఇప్పుడు మున్సిపాలిటీ పరిధిలో అత్యంత ఆసక్తికరంగా మారింది. వ్యూహ ప్రతివ్యూహాల నడుమ తెలంగాణ రాష్ట్ర రాజకీయ క్షేత్రంలో ప్రస్తుతం ఇద్దరు




నేతలు గెలుపు గుర్రాలై నిలుస్తున్నారు. ఒకరు ప్రజాబలంతో అసెంబ్లీలో అడుగుపెట్టిన ప్రస్తుత శాసనసభ్యులు ఇంకొకరు అదృష్టం కలిసిరాక ఓడిన మాజీలు.. తమ నియోజకవర్గంపై తనదైన ముద్ర వేయాలని చూస్తున్న తాజా మాజీల ఆశయం ఒక్కటే.. పీఠంపై తమ జెండాలు ఎగురవేయడం. కానీ, ఆ గెలుపు బాట అంత సులభంగా కనిపించడం లేదు.

**మున్సిపాలిటీ ఓటరే 'డిసైడింగ్ ఫ్యాక్టర్'**

నియోజకవర్గ గెలుపోటములను శాసించేది ప్రధానంగా రాష్ట్రం లోని మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లే. ఇక్కడి ఓటరు దేవుళ్ళు ఎటు మొగ్గు చూపుతారన్నదే ఇప్పుడు అందరిలోనూ నెలకొన్న ఉత్కంఠ. ప్రస్తుత ఎమ్మెల్యేలు తన అభివృద్ధి పనులతో ఓటర్లను మెప్పిస్తామనే ధీమాతో ఉన్నారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యేలు కేడర్‌ను బలోపేతం చేస్తూ తిరిగి పుంజుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

**మురిపిస్తారా.? 'ముంచేస్తారా.?ఓటరు చేతులో పని..**

రాజకీయ స్టంట్లు, ఆరోపణలు, విమర్శల పర్వం ఎలా ఉన్నా.. అంతిమ నిర్ణయం ఓటరు దేవుళ్ళదే. మున్సిపాలిటీలోని ప్రజలు ఒకరికి జై కొట్టి మురిపిస్తారా.? లేదా తమ ఓటు అనే ఆయుధంతో మరొకరి ఆశలను ఆవిరి చేస్తారా.? అనేది వేచి చూడాలి. ప్రస్తుతానికి మాత్రం రాష్ట్ర రాజకీయం జైలు గోడ మీద పిల్లిలా ఉందనే చెప్పాలి. ఎవరు గెలిచినా, ఓడినా ఈ ఓట్ల ' యుద్ధం మాత్రం తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఒక ప్రత్యేక చర్చకు దారితీస్తోంది.ఏక్ దిన్ కా సుల్తాన్ ఓటరు మనసెటో మరీ...

ఓటేస్తాం.... మాకేమిస్తావ్...?
ధోరణి మారని జనం
మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులున్నోడిదే గెలుపు
కుల మత రాజకీయాలదే రాజ్యం
పెద్దమనుషల ప్రసన్నం కోసం నాయకుల ప్రదక్షిణలు
మేమేస్తే మీరు గెలిచినట్లే..కానీ మాకేమిస్తావ్
అందరితో అదే మాట
అయోమయం లో జుట్టు పీక్కుంటున్న ఆశావాహులు

రాష్ట్రం లో ఎన్నికలవేడి పెరుగుతుంది.ఆశావాహులు మేమంటే మేమే గెలుస్తామనే ధీమా తో ఇంటింటికి ప్రచారం మెదలుపెట్టారు. కుల మత వర్ణ వర్గ పెద్దలతో తాయిలాలు మాట్లాడుకుంటున్నారు. కానీ మనస్సులో సందేహం.. నాకే వేస్తారా ఓట్లు అని.. ఎన్నికల ముందు మాట్లాడని వారు కూడా వంగి వంగి నమస్కారాలు పెడుతుండడం చూసి ముసిముసిగా నవ్వుకుంటున్నారు జనం. ఎన్నడూ మాట్లాడనివారు మాటకలుపుతూ అభిమానం చూపిస్తూ అభివృద్ధి కోసం మాట్లాడుతున్నారు.గెలిచినా ఓడినా నీవు నావాడివనే ఊతపదాలు ఎన్నివాడిన ఓటరు నాడి ఎటువైపో గుర్తించడం కష్టంగా మారింది. చలనచిత్ర పరిశ్రమలో సూపర్ స్టార్లు మెగాస్టార్ లు కూడా అబ్బురపోయేంత నటన ఆశవాహులది.. అంతకు మించి ఓటర్లది.. ఏది ఏమైనా ఓటు హక్కును కల్పించి ఎడ్డోనికి కూడా నడ్డివంచి దండాలు పెట్టిస్తున్న ఓ అంబేద్కరా మీకు ఏమిచ్చి ఋణం తీర్చుకొమ్మంటారు. నీ బొమ్మను కూడా ఇంట్లో పెట్టుకోవడానికి ఇష్టపడని వారు కూడా బడుగు బలహీన వర్గాల కాళ్ళు మొక్కిస్తున్నావు కదయ్యా..భారత భాస్కర.

ఒకడు భూస్వాములకు ఓటని ఒకడు పీజీ చేసిన వాడికే ఓటని ఒకడు దొరలకే ఓటు హక్కని కొట్లాడితే ఎంతో శ్రమకోర్చి అందరిని కాదని మీ వాదనతో ఒప్పించి మెప్పించి 18 సంవత్సరాల వయోజనులకు ఓటు హక్కు కల్పిస్తే ఆత్మగౌరవాన్ని చంపుకొని వారు వేసే ఎంగిలి మెతుకులకు ఆశపడుతున్న ఏక్ దిన్ కా సుల్తాన్ లను దేనితో కొట్టాలి ఎలా కొట్టాలి అని అనుకుంటున్నారు జనం. ప్రతి ఓటరు నిజాయితీతో ఓటును సద్వినియోగం చేసుకుంటే కుల మత వర్ణ వర్గ బేధాలు తొలగి అందరు ఒక్కటిగా కలిసిమెలిసి మేము భారతీయులం అని చెప్పుకునే రోజు త్వరలోనే వస్తుందని కోరుకుందాం.



## బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**కోహీర్ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు**

ఝరాసంగం ఫిబ్రవరి 06 (వాయిస్ టుడే) : మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కోహీర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు హోరెత్తించారు. శుక్రవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో గౌరవ శాసనసభ్యులు శ్రీ కొనింటి మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ కలిసి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, సీనియర్ నాయకులు కలీం, యువ నాయకులు మిథున్‌రాజ్, పార్టీ అభ్యర్థులు పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకొని, కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ, ఓట్ల కోసం ప్రజల ముందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులను వారు ఇచ్చిన “ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి?” అని ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు రంగులు మార్చి తామే చేశామని కాంగ్రెస్ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కోహీర్ పట్టణ అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని, ప్రజల ఆశీస్సులతో ఈ గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## అభివృద్ధికై మీ ముందుంటా.. ఒక్కసారి ఇవ్వండి

**22వ వార్డు అభ్యర్థి జాదం అనూష కిషన్...**




మెటుపల్లి ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి) : జగిత్యాల జిల్లా మెట్టుపల్లి పట్టణంలోని 22వ వార్డు అభ్యర్థి జాదం అనూష కిషన్... మాట్లాడుతూ... 22వ వార్డు ప్రజలు ఓటేసి గెలిపించాలని కోరారు. అభివృద్ధిలో మీ ముందు ఉంటా అని తెలిపారు. సంపంగి పెద్దరాజం వీరి వెంట ఉంటూ వార్డ్ లో ప్రతి సమస్యకి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి పని చేసుకుంటూ ఉంటామని అన్నారు.

# జగిత్యాల జిల్లా, మెట్‌పల్లిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఎన్నికల ప్రచారం

మెటుపల్లి.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి ఫిబ్రవరి 6: బిసి, ఎస్సి, ఎస్టీ, మైనారిటీలకు రాజ్యాధికారం రావాలంటే తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థులను గెలిపించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ( చింతపండు నవీన్ ) తెలిపారు. జగిత్యాల జిల్లా మెటుపల్లి పట్టణంలో పార్టీ అభ్యర్థుల కోసం వాడవాడన తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ తెలంగాణ లో కాంగ్రెస్, బి.ఆర్.ఎస్, బీజేపీ పార్టీలు బిసి, ఎస్సి, మైనార్టీలకు ఎం చేశారని ప్రజలు ఓటు వేయాలని మండిపడ్డారు. ప్రజల సంక్షేమానికి కేటాయించిన నిధులను,బి.ఆర్.ఎస్,కాంగ్రెస్ పార్టీలు అవినీతికి పాల్పడ్డారన్నారు. దొంగల పార్టీల నుండి ప్రజలను విముక్తి చేయడానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ వచ్చిందన్నారు. మన బిడ్డల జీవితాలు బాగుపడాలన్న,పేద,బడుగుల జీవితాలు బాగుండాలంటే తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థుల కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. 500 రూపాయలకు ఓట్లు అమ్ముకుంటే మన మన జీవితాలు నాశనం అవుతాయన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. ఆశించే స్థాయి నుండి శాసించే స్థాయికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరి శంకర్ గౌడ్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జ్ మాదం రజిని కుమార్, యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు బొడ్డుపల్లి



చంద్రశేఖర్,ఉమ్మడి అదిలాబాద్ ఇంచార్జ్ శ్రీనివాస్ మార్త,జిల్లా అధ్యక్షుడు పాపన్న,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ ఆకుల హన్మాండ్లు,జిల్లా కార్యదర్శి జోరిగె రజిత,జిల్లా యూత్ అధ్యక్షులు గుడ్ల తిరుపతి,సోషల్ మీడియా జిల్లా అధ్యక్షులు బూత్కూరి మధు ఇతర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed by Published by : Kotha Laxman on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, Editor: Kotha Laxman.